జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 22 పక్షపత్రిక నవంబర్ 16-30, 2016



## 'హోదా' దగా... కింకర్తవ్యం ?

## రాజ్యాంగ దినోత్సవం- రాజ్యాంగ వ్యతిరేక ఆందోళనా పద్ధతులు



"Constitutional morality is not a natural sentiment. It has to be cultivated. We must realise that our people have yet to learn it..."

Dr Ambedkar, Constituent Assembly

NOVEMBER 26
CONSTITUTION DAY



## ట్రంపే గెలిచారు !










విద్యార్థులు, యువతకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌లో సలహాసూచనలు, శిక్షణ అందించేందుకు గుంటూరులో ఏర్పాటైన 'ఛాంపియన్స్ అకాడమీ' ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి

పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# SRI ROHINI DEGREE COLLEGE

**Chilakaluripeta**

## DEGREE RESULTS: I YEAR



K.DURGA MALLESWARI
B.Sc (M.S.Cs) - 93% (372/400)



G.ASWINI
B.Sc (M.S.Cs) 89.2%(357/400)



P.ROSHINI
B.Sc (M.S.Cs) - 88.7%(355/400)



SK.RESHMA
B.Sc (M.P.Cs) - 89%(356/400)



T.LAKSHMI DURGA
B.Sc (M.P.Cs) - 88%(352/400)



M.LAKSHMI PRASANNA
B.Sc (M.P.Cs) - 84%(335/400





SK.BAJI MUNNISA
B.Com (COMP) - 87%(304/400)



N.HEMAL
B.Com (COMP) - 80%(280/400)

## II YEAR



K.DURGA VANI
B.Sc (M.PCS) - 81.6%(366/400)



K.PA VANI
B.Sc (M.PCS) - 80.6%(363/400)



P.SURESH
B.COM (Comp) -74%(300/400)



N.RAVI TEJA
B.COM (Comp) -73%(292/400)

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి

పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు


PAC Pavuluri Associates & Constructions

We Build your dream

Door no. - 4/199, 4th Line, Pandaripuram, Chilakaluripet,
Phone: 08647 - 251670, Cell : 9346473104, email : syampavuluri@gmail.com



Pavuluri Syam Prasad
B.E.Civil - FIV



Buildings Plans, Estimations, Layouts, Valuations, Supervising.



Licenced Surveyour for chilakaluripet Muncipality,
Guntur District Panchayats, Consulting Engineer.

జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక నవంబర్ 16-30, 2016
సంపుటి - 7 సంచిక - 22

## లోపలి పేజీల్లో...

పెద్దనోట్ల రద్దు ఆరంభమే... ఎన్నికల......... 5
హోదా దగా.... కింకర్తవ్యం ?................. 8
రాష్ట్ర విభజన సమయంలో ఏపీ ప్రజల........ 13
ఉద్యోగ సంక్షోభం చుట్టుముడుతోంది....... 16
స్వాతంత్ర్యాన్ని మళ్లీ కోల్పోవద్దు.............. 19
అప్పుల ముప్పులో ఆంధ్ర ....................... 23
వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా ......... 25
ఆంధ్రప్రదేశ్‌లో ఈ - ఆఫీసు.................... 26
జిందాల్ భూములను రైతుల .................. 27
చంద్రబాబుకు ఆదరణ తగ్గుతోంది........... 28
రాజకీయ కబంధ హస్తాల నుంచి విశాఖ.... 29
రాయలసీమలో పీపీసీ గ్రామీణ గ్రంథాలయ. 31
కిరణ్మయికి లోక్‌సత్తా సెల్యూట్ ............... 32

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ట్రంపే గెలిచారు !



ఆమె గెలిచివుంటే.. 'మహిళలకు ఓటు హక్కు వచ్చిన దాదాపు వందేళ్ల తర్వాత ఓ మహిళ అమెరికా అధ్యక్షురాలిగా ఎన్నికైంది, హిల్లరీ క్లింటన్‌తోపాటు ఆమె ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కూడా గెలిచినట్టే అని చెప్పాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ట్రంపే గెలిచారు అని చెబితే చాలు. ఒకవేళ తాను ఓడిపోయినా అలాంటి పులిని అమెరికాలో తయారుచేశారు ట్రంప్! జాత్యహంకారం, మహిళల పట్ల వివక్షకు, ప్రపంచీకరణ వ్యతిరేకుల వాదనలకు భిన్నంగా అమెరికాలోనే తక్కువ చదువుకున్నవారికి ఉద్యోగాలు, ఆదాయాలు తగ్గిపోవటానికి, ఉగ్రవాదానికి నిర్మాణాత్మక పరిష్కారాల్ని చూపించకుండా విద్వేషపూరిత, సంకుచిత చిట్కాలను చూపిన ట్రంప్ గెలవటం అమెరికా సమాజానికే కాకుండా, యావత్ ప్రపంచానికీ కుదుపే. 'నా సమస్యకు వేరెవరో కారణం .. ఎవరో నష్టపోతేనే నేను ప్రయోజనం పొందగలను' అనే ధోరణి సమాన ఓటు హక్కు, భావప్రకటనా స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే స్వేచ్ఛ ఉన్న దేశంలో అనాగరిక ప్రజాస్వామ్య సంస్కృతే తప్ప ఆధునిక ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అత్యున్నత పదవులకు ఎన్నికైన వారి స్వభావం, వ్యక్తిత్వం గురించి కూడా అసాధారణరీతిలో చర్చించాల్సిన పరిస్థితిని ట్రంప్ కల్పించారు. ఇదంతా ట్రంప్ నాటకం, మార్కెటింగ్ ట్రిక్కే అనుకున్నా.. ముస్లింలు, మహిళలు, వలసదారులపై ఆయన ఇప్పటికే అమెరికా సమాజంలో నిద్రలేపిన విద్వేషాలు ఆయన పాలనను పులి మీద స్వారీలాగానే మారుస్తాయి. 'ఒక దేశంగా అమెరికా ఏమిటి?' అని ట్రంప్ లేవనెత్తిన పెనుసవాలుకు జవాబివ్వటం ఆయనక్కూడా అంత తేలిక్కాదు. హిల్లరీ క్లింటన్‌లో డాంబికత, దాపరికం, కొన్ని అప్రజాస్వామిక ధోరణులు ఉన్నా ట్రంప్ కంటే ఆమె ప్రజాజీవితం కోసం సుదీర్ఘ సమయమిచ్చిన వ్యక్తి. అయితే, ట్రంప్ వికృత రాజకీయానికి, సంకుచిత విధానాలకు ప్రత్యామ్నాయంగా.. అందరికీ విద్య, వైద్యం, జీవన భద్రతనిచ్చే నిర్మాణాత్మక విధానాలతో యువతను ఆకట్టుకున్న సొంత డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీ అభ్యర్థి బెర్నీ శాండర్స్‌ను బరి నుంచి వైదొలిగేలా చేశాకైనా ఆమె ఆ ఎజెండాను పూర్తిస్థాయిలో స్వీకరించినట్టు కనపడదు. అందుకే ప్రచారంలో చివరిదశకొచ్చేసరికి ప్రతి చిన్న ఆరోపణా ఆమె విజయావకాశాల్ని ప్రభావితం చేసింది. హిల్లరీ, ట్రంప్ కంటే ఒబామానే మళ్లీ ఎన్నుకోవటం మేలన్న భావన కూడా వ్యక్తమైంది. చైనా, ఆటోమేషన్ ధాటికి పెరిగిన ఆర్థిక, ఉద్యోగ సంక్షోభంతోపాటు 'మార్పు' నినాదంతో ఎన్నో ఆశల మధ్య ఎన్నికైన బరాక్ ఒబామా ఆశించిన స్థాయిలో అమెరికాను పునరావిష్కరించలేకపోవటం, ఇరాన్ ఒప్పందం కుదిర్చినా తనకు తెలియకుండానే రష్యాతో ప్రచ్ఛన్న యుద్ధానికి మళ్లీ తెరతీయటం, వలసల పట్ల వివిధ ఐరోపా దేశాల్లో ఆందోళనలు, నల్లజాతీయులపై భౌతిక దాడులు.. ఇలాంటివన్నీ సోషల్ మీడియా యుగంలో ట్రంప్ వేగంగా ఎదగటానికి దోహదం చేశాయి. సాంప్రదాయ మీడియాను చీల్చిచెండాడి మరీ డబ్బు ప్రచారంతో ట్రంప్ ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. హిల్లరీ, ట్రంప్‌లలో ఎవరు గెలిచినా వాణిజ్యపరంగా మనదేశం మీద పెద్ద ప్రభావం ఉండకపోవచ్చుగానీ, ప్రజాస్వామిక సంస్కరణలపరంగా మనదేశానికి ఈ ఎన్నికల పాఠాలు ఎంతో విలువైనవి. మనిషికో తుపాకీ లేకపోవటం, లోపభూయిష్టమైనా పటిష్ట కుటుంబ వ్యవస్థ ఉండటం వంటి కారణాల వల్ల అమెరికాకున్న కొన్ని సమస్యలు మనకు లేవుగానీ.. తీవ్ర నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, వివక్ష, ఉగ్రవాదం వంటి వన్నీ మనకూ ఉన్నాయి. అర్హత లేనివారిని ఎన్నుకుంటున్నామన్న బాధ అమెరికాది అయితే, అర్హత గలవాళ్లు ఉన్నా, వారిని ఒక సమాజంగా ఆదరిస్తున్నా వారికి ఎన్నికల్లో ఓట్లు వేయలేని సమస్య మనదేశానిది. ప్రలోభాలు, భావోద్రేకాలు తప్ప ఆయా అంశాల మీద అవగాహనతో ఓట్లు వేసే వారు మనలో తక్కువ. ప్రజల నుంచి వచ్చిన విరాళాల ద్వారా కాకుండా లక్షల కోట్ల నల్లడబ్బుతో పార్టీలను నడుపుతూ ఎన్నికలలో గెలుపు కోసం ప్రయత్నిస్తుంటారు. బలమైన ప్రజాస్వామిక సంస్కృతి వేళ్లూనుకున్న అమెరికా 2016 ఎన్నికల్లో తనకు ఎదురైన ఒడిదుడుకులను కొంతకాలం తర్వాతైనా అధిగమించే అవకాశముంది. కానీ పేదరికం, అవిద్య, బలహీన వ్యవస్థల మధ్య ట్రంప్ ధోరణులు తరచుగా కనిపించే భారత్ పరిస్థితి ఏమిటి? ఎప్పటికి ఆధునిక ప్రజాస్వామ్యాన్ని అందుకోగలం? అందుకు కావలసిన రాజకీయ పార్టీల ప్రజాస్వామీకరణ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి సంస్కరణల సంగతేమిటి? ట్రంప్.. పాలనలో కూడా దారుణంగా వ్యవహరిస్తే తట్టుకునే వికేంద్రీకరణ వ్యవస్థ అమెరికా రాష్ట్రాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో బలంగా ఉంది. కానీ మనదేశంలో ప్రధాని-ముఖ్యమంత్రి తప్ప అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాల వ్యవస్థ ఏది? ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యత చట్టబద్ధ పాలన అని గుర్తించటానికి కూడా సిద్ధంగా లేని స్థాయిలో వున్నామిప్పుడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్-ఒడిషా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌ని, మధ్యప్రదేశ్‌లో 'సిమి' కార్యకర్తలను కాల్చిచంపడాన్ని చూస్తే మన ప్రజాస్వామ్యం ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతుంది. వీటి మీద ఉన్నతస్థాయి న్యాయవిచారణ జరగాలి. కానీ నిజమైన ప్రజాస్వామిక పరిష్కారం కోసం ఇంకా చాలా చేయాలి. మనం చిన్న తుపాకీ తీస్తే రాజ్యం పెద్ద తుపాకీ ప్రయోగిస్తుంది. హింస అందరికీ నష్టమే. కాబట్టి మావోయిస్టులు తుపాకీ వీడి ప్రజలకున్న ఓటు, భావప్రకటనాస్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే హక్కును ఉపయోగించి అందరికీ ఎదిగే అవకాశాలున్న ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వాలు కూడా వార్డు స్థాయి వరకూ ప్రజల్లోకి వికేంద్రీకరించి తలసరి ఏటా రూ.2000 కేటాయింపులు చేసి 'పౌరసేవల గ్యారంటీ' చట్టంతో సర్కారీ కార్యాలయాల్లో అవినీతి లేని సేవలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అందిస్తే, పోలీసు, న్యాయ సంస్కరణల్ని తెస్తే నక్సలిజం తలెత్తదని గుర్తించాలి. రోజురోజుకీ సమాచారం పెరుగుతున్నా వాస్తవాలు కరవవుతున్నాయని గుర్తెరిగి ఆధునిక ప్రజాస్వామ్య సంస్కరణల కోసం పోరాడటమే అమెరికా నుంచి ఆంధ్ర వరకు తాజా పరిణామాలు చేస్తున్న దిశానిర్దేశం.

మీ
జయప్రకాష్

# కార్టూన్ కార్నర్



పాపం వాళ్లు కూడా ఎలక్షన్లో డబ్బులు పంచాలిగా సార్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*


చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# పెద్దనోట్ల రద్దు ఆరంభమే.. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన, పన్నుల తగ్గింపు, పన్ను డబ్బు సద్వినియోగానికి సంస్కరణలు కావాలి : జేపీ




**రూ.** 500, 1000 కరెన్సీ నోట్లను తక్షణం రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య నల్లధనాన్ని, నకిలీ నోట్లను నిరోధించటంలో ఒక ముందుడుగేగానీ, మళ్లీ అవినీతి జరగకుండా చేస్తూ ప్రజలకు సమర్థ పాలన అందించటానికి మాత్రం సరిపోదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

“ఇది సంస్కరణలకు ఆరంభమే తప్ప అంతం కాదు. సొంత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలలో పలువురు నల్ల డబ్బు ఖర్చు పెట్టే ఎన్నికైనా ప్రధాని నరేంద్రమోదీ ఇంత సాహసోపేతంగా వ్యవహరించటం ఆహ్వానించ దగ్గ పరిణామం. అయితే ఇది రాజకీయ గిమ్మిక్కుగా మిగిలిపోకూడదంటే.. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన, పన్నులు తగ్గింపు, ప్రజల పన్నుల డబ్బును నాయకుల విలాసాలకు, ఉద్యోగుల జీతాల భారీ పెంపునకు కాకుండా ప్రజల సేవల కోసం సద్వినియోగం చేసే సంస్కరణలను చేపట్టాలి” అని జేపీ అన్నారు. జనన ధృవపత్రం లాంటి ప్రభుత్వ సేవల కోసం గతిలేక లంచం ఇచ్చినవారికి కూడా కారాగార శిక్ష విధించాలని, అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వ ఉద్యోగి మీద పోలీసు కేసు పెట్టాలన్నా అనుమతి కావాలని అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన దుర్మార్గపు సవరణల్ని మోదీ సర్కారు ఉపసంహరించుకోవాలన్నారు.

రాత్రికి రాత్రి పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల మళ్లీ పెద్దనోట్లు వచ్చినా నల్లడబ్బును దాచుకోవడానికి కొంత భయపడే వాతావరణం ఉంటుందని, అయితే వస్తురూపంలోనో, లంచాలను విదేశాల్లో ఉన్న తమ బంధువుల ఎకౌంట్లలో జమ చేయించటం ద్వారానో, మరో విధంగానో అవినీతిని, ఓట్ల కొనుగోలును యధావిధిగా కొనసాగించే తెలివితేటల్ని మన వ్యవస్థలో ప్రదర్శించగలరని జేపీ అన్నారు. అందువల్ల, ఇదే వేడిలో ఓట్లు కొనే ఎన్నికల వ్యవస్థను కూడా ప్రక్షాళన చేసి ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు ఉత్సాహం చూపే వ్యవస్థను నిర్మించే చర్యలు చేపట్టాలన్నారు. నల్లడబ్బు తగ్గటం వల్ల ప్రత్యక్ష పన్నులతోపాటు ఆన్‌లైన్ లావాదేవీలతో పరోక్ష పన్నులు కూడా పెరుగుతాయికాబట్టి పన్ను రేట్లను తగ్గించాలన్నారు. పన్నులు తగ్గితే నల్లడబ్బుకు మూలమైన రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో కూడా ప్రజలు స్వచ్ఛందంగా చెల్లింపుల్ని వెల్లడిస్తారన్నారు. ప్రభుత్వాలు ఆదాయం పెంచుకుని తమ విలాస సౌకర్యాలకు, ఉద్యోగుల భారీ జీతాలకు ఆ డబ్బును వెచ్చిస్తూ ఉంటే ప్రజలు సంస్కరణల్ని కూడా వ్యతిరేకిస్తారని.. అందువల్ల ప్రజల పన్నుల డబ్బును వారి కోసమే సద్వినియోగం చేసేలా అధికారాన్ని వికేంద్రీకరించటం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల రంగాలకు కేటాయింపులు పెంచటం, ప్రభుత్వ కార్యాలయాల్లో ‘హక్కుగా పౌరసేవలు చట్టం’ అమలు చేయటం వంటి చర్యలు చేపట్టాలన్నారు. అమరావతిలో ఉండే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయాన్ని రూ. 10కోట్లతో వృధాగా అలంకరించటం, ప్రత్యేక విమానాల్లో ప్రయాణించటం, అమెరికా అధ్యక్షుని వైట్‌హౌస్‌ని తలదన్నేలా తెలంగాణ ముఖ్యమంత్రి నివాస భవనాల్ని నిర్మించుకోవటం కోసమా ప్రజలు పన్నులు చెల్లిస్తున్నది? అని జేపీ ప్రశ్నించారు. రూ. 500, 2000 వంటి పెద్ద నోట్లు మళ్లీ తేవటంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. నోట్ల నిషేధం వల్ల సామాన్య ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు, నల్లడబ్బు చెలామణి తగ్గటం వల్ల ద్రవ్యోల్బణం పడిపోయి సమస్యలు తలెత్తకుండా ఆర్థికమంత్రిత్వ శాఖ, రిజర్వుబ్యాంకు తగిన చర్యలు తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు. ★

# 'హోదా' దగా .. కింకర్తవ్యం?

**(రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా 'వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా'ను ప్రత్యామ్నాయంగా అడుగుదాం- కలసి పోరాడదాం - పన్ను రాయితీలు సహా సాధిద్దాం)**

నమ్మించి మోసం చేయడాన్ని మించిన దుర్మార్గం ఉండదు అన్నది పరమ కర్కోటక నేరస్తులు కూడా పాటించే సూత్రం. మానవత్వం లేని హృదయాల్ని కూడా అంతగా పిండేస్తుంది అలాంటి మోసం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల పరిస్థితి అదే. ఇచ్చిన ఎంతో కీలకమైన హామీని నెరవేర్చకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న రాజకీయ క్రీడ వారిని ఎంతో ఆవేదనకు గురిచేస్తోంది. అందుకే విభజన సమయంలో రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడకుండా ఓట్ల రాజకీయాలు చేసి, ఇప్పుడు ప్రత్యేక తరగతి హోదాపై కూడా దగా చేస్తున్న తమ నాయకుల కంటే.. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కోసం ముసుగులు లేకుండా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మేలన్న భావన ఆంధ్రప్రదేశ్‌లోని చాలామంది ప్రజల్లో కలుగుతోంది. తమ అభిప్రాయాలతో సంబంధం లేకుండా రాష్ట్ర విభజన చేయటానికి, ఇంత జరిగినా తమకు ప్రత్యేకించి నష్టపరిహారం లేకపోవటానికి కేసీఆర్ కంటే కూడా తమ ప్రాంత నాయకులే కారణమని ఏపీ ప్రజలకు ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. ప్రత్యేక హోదా హామీ ఆచరణసాధ్యం కాదని నచ్చచెప్పేందుకు ప్యాకేజీ పేరుతో చేస్తున్న ప్రచారం వారిని నిస్సహాయతలోకి, అయోమయంలోకి నెడుతోందే తప్ప ఉపశమనం కలిగించటం లేదు. ఎన్నికలప్పుడు, మేనిఫెస్టోల్లో నమ్మించి ఓట్లు పొందాక దగా చేశారన్న బాధ వారి నుంచి వ్యక్తమవుతుండగా, ప్రత్యేక హోదాలో ఉన్న సాంకేతికాంశాలు వారికి అర్థంకావు, హోదా ఆచరణ సాధ్యం కాదు అనే అబద్ధాన్ని పదే పదే చెబుతుంటే 2019 ఎన్నికలనాటికి ఈ మోసం వారికి గుర్తుండదు అనే ధీమా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కనిపిస్తోంది.

హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోవటం, రాజధాని లేకపోవటం వంటి కారణాల వల్ల 2014 పునర్విభజన చట్టంలోని అంశాలను అమలుచేయటంతోపాటు నూతన ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక తరగతి హోదా ఇస్తామని నాటి ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. హోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు, పదిహేనేళ్లు అమలుచేస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ, తెలుగుదేశం పోటాపోటీగా ప్రకటించాయి. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయి. చివరికి ఇప్పుడు ప్రత్యేక హోదా సాధ్యం కాదు, అంతేస్థాయి రాయితీల్ని వేరే రూపంలో ఇస్తామని 'ప్రత్యేక సాయం' పేరుతో కేంద్రంలోని బీజేపీ నేతృత్వ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబర్ 7, 2016న కేంద్ర




ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన ప్రత్యేక సాయానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రమోషన్ ఇచ్చి మరీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాగతించారు. ఇది చాలా గొప్ప సాయమంటూ కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు తెలుగునాట ఘనసన్మానాలు అందుకున్నారు. పార్లమెంటు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీకి తగ్గట్టుగా ప్రత్యేక హోదా పేరు మార్చి సాయం ఇస్తే అభ్యంతరం అక్కర్లేదు. కానీ ఇప్పుడు ప్రకటించింది (రేపు ఇది కూడా సరిగ్గా అమలుచేస్తారన్న గ్యారంటీ లేదు) 'హోదా'కు తగ్గ సాయమా?.. కానే కాదు. తిమ్మిని బమ్మిని చేసి ప్రజలను భ్రమింపచేసేందుకే ప్రత్యేక హోదాకు కూడా నిర్వచనాన్ని మార్చి పారిశ్రామిక రాయితీలు ఇందులో భాగం కాదని తెదేపా, బీజేపీ వర్గాలు భ్రమింపచేసే ప్రయత్నం చేస్తున్నాయి. అంతకుముందు, ప్రత్యేక హోదా వచ్చిన రాష్ట్రాలకు కూడా ఒరిగిందేమీ లేదని చేసిన అబద్ధపు ప్రచారానికి ఇది కొనసాగింపుగానే చూడాలి. పారిశ్రామిక రాయితీలు ప్రత్యేక హోదాలో భాగమేనన్నది నిర్వివాదంగా అంగీకరించాల్సిన విషయం. తాజా ప్రత్యేకహోదా రాష్ట్రానికి కూడా పన్ను రాయితీలు కల్పించారని గుర్తించాలి. అలాగే ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఇచ్చే పన్ను రాయితీల వల్ల సంక్లిష్ట పరిస్థితులున్న కాశ్మీర్ మినహాయించి మిగిలిన అన్ని 'ప్రత్యేక' రాష్ట్రాలలో పరిశ్రమలు, ఉద్యోగాలు గణనీయంగా

పెరిగాయన్నది కూడా గణాంకాలు చెబుతున్న వాస్తవం.

అంటే.. పోలవరంపై మాట నిలబెట్టుకుంటారనుకున్నా, ప్రత్యేక హోదాకు బదులంటూ ప్రత్యేక సాయం పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు జరిగింది దగా!

ప్రత్యేక హోదా వల్ల వచ్చే రాయితీలు, ప్రోత్సాహాల ఫలితంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో అనేక పరిశ్రమలు వచ్చి లక్షలాదిమందికి ఉపాధి లభించిందని సాక్షాత్తూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో సభ్యుడు కె.సి త్యాగి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కోటి జనాభా కలిగిన ఉత్తరాఖండ్‌లో హోదా వచ్చిన నాటికి అంటే 2008-09 నాటికి 1907 ఫ్యాక్టరీలు ఉంటే, ఐదేళ్ల తరువాత 2012-13 నాటికి వాటి సంఖ్య 14,440కి పెరిగింది. ఉద్యోగుల సంఖ్య 2008-09లో 1,72,861 ఉంటే, 2012-13నాటికి 6,35,759కి పెరిగారు. ఈ 1907 పరిశ్రమల మూలధన పెట్టుబడి (క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) విలువ 2008-09నాటికి 21,898కోట్లు ఉంటే, అదే 2012-13నాటికి 1,02,711కోట్లకు పెరిగింది. అదేవిధంగా 68లక్షలు జనాభా కలిగిన హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ పదమూడు సంవత్సరాలలో దాదాపు 10,864 పరిశ్రమలు కొత్తగా ఏర్పడ్డాయి. రూ. 15,324.25కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పరిశ్రమల ద్వారా 1,29,443మందికి కొత్తగా ఉద్యోగాలు లభించాయి. అంటే హోదా కారణంగా రెండు శాతం మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించినట్టయింది. ఇవికాక ఈ పరిశ్రమలకు అనుబంధంగా అనేక చిన్న పరిశ్రమలు వేలసంఖ్యలో స్థాపితమై లక్షలాదిమందికి ఉపాధి దొరికింది. ఇదంతా ప్రత్యేక తరగతి హోదా వల్ల వచ్చే పారిశ్రామిక రాయితీల వల్లే సాధ్యమయిందన్నది వాస్తవం.

## సుజనా చౌదరి, సీఎం రమేష్, గల్లా వంటి వాళ్లూ రాయితీల కోసమే అక్కడ పెట్టుబడి పెట్టారు

అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఏపీకి సాయంగా హోదా పేరుతో పారిశ్రామిక రాయితీలు ఇస్తే తమ పరిశ్రమలు పొరుగు రాష్ట్రానికి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖ రాశారు. రాయితీలు, ప్రోత్సాహకాలు ఉండటం వల్లే మన రాష్ట్రానికి చెందిన రెడ్డీస్ ల్యాబరేటరీస్, అరబిందో ఫార్మా, జెన్ టెక్నాలజీ వంటి సంస్థలతోపాటు ర్యాన్‌బ్యాక్సీ, సిప్లా, డాబర్, బ్లూస్టార్, అంబుజా, మైక్రోటెక్ వంటి దిగ్గజ సంస్థలన్నీ హోదా కలిగిన హిమాచల్ ప్రదేశ్‌లో తమ యూనిట్లను నెలకొల్పాయి. పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టే ముందు తమకు ఏ రాష్ట్రంలో రాయితీలు ఇస్తారు? ప్రోత్సాహకాలు లభిస్తాయి? వాటి వలన కలిగే తక్షణ ప్రయోజనాలేమిటి? దీర్ఘకాలంలో వచ్చే లాభాలేమిటి? అని ఆలోచిస్తారే తప్ప వారికి ఏ ప్రాంతంపైనా ప్రేమకానీ, ద్వేషంకానీ ఉండవు. ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీయే ముద్దు అని చెబుతున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి న్యూ ల్యాండ్స్ ఇండస్ట్రీస్ పేరుతో ఫ్యాన్లకు సంబంధించిన తయారీ యూనిట్‌ను, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ నార్త్ ఈస్ట్రన్ పవర్ ప్రాజెక్టును, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శివశక్తి బయోటెక్ ప్లాంటెక్ లిమిటెడ్ అనే కంపెనీని ఉత్తరాఖండ్‌లో ఏర్పాటు చేసుకుంటే, ఎంపీ గల్లా జయదేవ్ ఉత్తరాంచల్‌లో అమరరాజా కంపెనీ బ్యాటరీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ వారు స్వయంగా తమ పరిశ్రమల వార్షిక నివేదికల్లో వెల్లడించిన సంగతులే. అయితే వీరే ఈవేళ ప్రత్యేక తరగతి హోదాకి, పారిశ్రామిక రాయితీలకు సంబంధం లేదని వాదించడం విడ్డూరం. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోతుండటం వల్ల మిగిలిన ఏపీకి ప్రత్యేక తరగతి హోదా రావాలని మొట్టమొదట ప్రతిపాదించింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్! రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా అంటే ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశముంది కాబట్టి, అత్యంత వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని జనవరి 18, 2014న అసెంబ్లీలో గణాంకసహితంగా ప్రతిపాదించారు. దక్కనులో, దక్షిణాదిలో ఇప్పటివరకూ లేని ఈ హోదాను సీమకు ఇవ్వటంతోపాటు వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం ఇవ్వాలని కోరారు. ఏపీకి వచ్చే లోటుపై జేపీ బైటపెట్టిన లెక్కల్ని, చేసిన ప్రత్యేక హోదా ప్రతిపాదననే ఆ తర్వాత పార్టీలకతీతంగా వ్యవహరించి కాంగ్రెస్, బీజేపీ పార్లమెంటులో తీసుకున్నాయి. అయితే జేపీ రాయలసీమకు హోదా, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం ప్రతిపాదిస్తే, ఆ పార్టీలు ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా అని తెలిసోతెలియకో, ఓట్ల కోసమో ప్రజలకు తీవ్ర నష్టం చేశాయి. ఓట్లు, సీట్లు వున్న పార్టీలు రాష్ట్రమంతటికీ హోదా తెస్తామంటే మనం అడ్డంకొట్టటమెందుకని లోక్‌సత్తా కూడా అందుకు మద్దతిచ్చింది.

## హోదా ప్రతిపాదన వెనక రాయితీలు కీలకం

అసెంబ్లీలో జేపీ చేసిన ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదనలో కూడా 100శాతం కార్పొరేట్, ఎక్సయిజ్ పన్ను మినహాయింపులతో కూడిన పారిశ్రామిక రాయితీలు హోదాలో కీలక భాగంగా వున్నాయి. హోదాలో భాగంగా పన్ను రాయితీలు విధానపరంగానే కాకుండా రాజకీయంగా కూడా స్థిరపడిన నిబంధన.

**చంద్రబాబుకి, కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడ మూడు సూటి ప్రశ్నలు:**

1) ఏపీ ప్రత్యేక హోదాకు ఒప్పుకోని రాష్ట్రాలు.. హోదాతో సమానంగానో, ఎక్కువగానో సాయం అందిస్తే ఊరుకుంటాయా?

2) ప్రత్యేక హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగం కాకపోతే.. ఏపీకి హోదా ప్రతిపాదన చర్చ మొదలవగానే అలా

పన్ను రాయితీలు ఇవ్వటం తమకు నష్టమనే ఆందోళన వ్యక్తం చేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఎందుకు కేంద్రానికి లేఖ రాశారు?

3) ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీల వల్ల ఒరిగేదేమీ లేదని కూడా ప్రచారం చేస్తున్న మీరు.. అంత భారీ లాభం చేకూరే అవకాశం ఉండకపోతే ప్రత్యేక సాయంలో ఎందుకు చేర్చలేదు, ప్రత్యేక హోదాలో అవి భాగం కాదని మీరు పనిగట్టుకుని ఎందుకు ప్రచారం చేయాల్సివస్తోంది?

నిజానికి లోక్‌సత్తా ప్రత్యేక హోదాను ప్రతిపాదించటం వెనక ఉన్న అంశాలలో రెవిన్యూ లోటును పూడ్చటం, జాతీయ సంస్థల్ని ఏర్పాటు చేయడం, పారిశ్రామిక రాయితీల్ని ప్రకటించటం ప్రధానమైనవి. వీటిలో మొదటి రెంటినీ కేంద్రం నెరవేరుస్తోంది. రెవిన్యూలోటు పూడ్చటం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, ఎంత లోటో చెప్పలేకపోతోంది. కాగ్ చెప్పింది కదా, గవర్నర్ చెప్పారు కదా అని దాటవేస్తూ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆడంబరాలు, సొంత తాయిలాల పథకాలను మినహాయించి పాలనా పరమైన అంశాలలో లోటు ఉందని తేలితే కచ్చితంగా ఆ లోటును పూడ్చుతామని కేంద్రమే చెబుతున్నందున వివాదం లేదు. పైగా రాష్ట్రాలకు కేంద్ర నిధులు 42శాతానికి పెరిగిన నేపథ్యంలో కొంత రెవెన్యూ లోటు కూడా తగ్గినట్టు కనిపిస్తోంది. అలాగే జాతీయ సంస్థల్ని వేగంగానే ఏర్పాటు చేస్తున్నారు. దుగ్గరాజపట్నం, రామాయపట్నం (కాకినాడ-కృష్ణపట్నం మధ్య) వద్ద పోర్టులు వంటి మౌలికవసతుల ఏర్పాటులో ఇంకా వేగం కావాలి. అయితే ఇవన్నీ ఏపీని కేంద్రమే విడగొట్టింది కాబట్టి చేయటం లేదు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల్లో భాగంగా అన్ని రాష్ట్రాలకూ చేస్తున్నారు, ఏపీకీ చేస్తున్నారు. కాబట్టి రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి ప్రధానమైనది - పారిశ్రామిక రాయితీల్ని ప్రకటించటం! పెట్టుబడి తరుగు రాయితీలు వంటివి కాదు నూరుశాతం పన్ను రాయితీల్ని పరిశ్రమలకు ఇవ్వాలి. వ్యవసాయానికి, ఇతరత్రా కొన్ని వడ్డీ రాయితీల్నీ ఇవ్వాల్సుంటుంది. ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా కొత్త పరిశ్రమలకే ఈ సబ్సిడీలను వర్తింపచేయొచ్చు.

ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు ఉంటేనే ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక సంస్థలు భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి రావడానికి అవకాశాలు బాగా పెరుగుతాయి. నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు రావడంతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. కానీ గత రెండున్నరేళ్లుగా ఏనాడూ చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి కావలసింది ఇదీ అని నిర్దిష్టంగా కేంద్రానికి చెప్పలేకపోయారు, అడగలేకపోయారు. విభజన తర్వాత నష్టాలను ఎదుర్కొనే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కనీసం 15 సంవత్సరాలు కల్పిస్తే తప్ప రాష్ట్రం కోలుకోలేదని చెప్పిన ఆయనే ఇప్పుడు కేవలం కొద్దిపాటి సాయానికి తలగ్గడం అందరినీ విభ్రాంతికి గురిచేస్తోంది. కేంద్ర మంత్రి హోదాలో సుజనా చౌదరి, తెదేపా ఎంపీలు కూడా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం చివరి వరకూ పోరాడతామని అనేకసార్లు ప్రకటనలు చేయడం, పార్లమెంటులో నినాదాలు చేయడం అందరికీ తెలిసిందే. ఇప్పుడందరూ హఠాత్తుగా మాట మార్చారు.

## 2014లోనే హెచ్చరించినా తాత్సారం చేశారు

ప్రత్యేకహోదా అమలుపై కేంద్రం తాత్సారం చేస్తుంటే 2014 సంవత్సరాంతంలోనే లోక్‌సత్తా ఏపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ప్రత్యేకహోదా పేరు మార్చినా ఫర్వాలేదు, ముందు పారిశ్రామిక రాయితీల్ని ఇచ్చేలా మోదీ ప్రభుత్వాన్ని ఒప్పించాలని, ఇది ఒక కేబినెట్ నిర్ణయంతోనే చేసేయొచ్చని సూచించింది. ఎట్టకేలకు కొన్ని నెలల తర్వాత ఢిల్లీ వెళ్లి మొత్తం రాష్ట్రానికికాకుండా అమరావతి రాజధాని ప్రాంతానికి మాత్రమే పారిశ్రామిక రాయితీలు కావాలని చంద్రబాబు అడిగారు. ఇప్పుడేమో అసలు ప్రత్యేకహోదాలో పన్ను రాయితీలు భాగమే కాదు అని నాలిక మడతేసి ప్రచారం చేస్తున్నారు.

### ప్రత్యామ్నాయం సూచించలేకపోయారు .. లోక్‌సత్తా ప్రతిపాదించినా పట్టించుకోలేదు

హోదాకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని కేంద్రం పలుమార్లు సూచనప్రాయంగా చెప్పినా, ప్రత్యామ్నాయాన్ని చంద్రబాబు సూచించలేదు. రాష్ట్ర విభజన సమయంలో ఎలాగైతే అసెంబ్లీలోసహా ఎక్కడా పరిష్కారం చెప్పకుండా తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీథుల్లో తాకట్టుపెట్టారో, అలాగే ప్రత్యేకహోదా విషయంలో కూడా ఢిల్లీ చెప్పాక రియాక్షన్లే తప్ప సొంత ప్రతిపాదనలు లేవు. పోనీ అన్ని పార్టీలనూ కలుపుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఢిల్లీని ఒప్పించే ప్రయత్నం చేశారా అంటే అదీ లేదు.

ప్రత్యేక హోదాకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తున్నందున ఏపీ అభివృద్ధి సమయం వృథా కాకుండా లోక్‌సత్తా ఒక నిర్మాణాత్మక పరిష్కారం సూచించింది. "రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశంలోని వెనకబడిన 80-100 జిల్లాలకు ప్రత్యేక హోదా" ఇచ్చేలా కేంద్రానికి ప్రతిపాదించమని కోరింది. దీనివల్ల ఏ రాష్ట్రానికీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. దేశంలో ఫెడరలిజం బలపడుతుంది. వెనకబడిన జిల్లాల్లో నుంచి నగరాలను తొలగించి, ఇతర జిల్లాల్లోని (మార్కాపురం లాంటి) మెట్ట ప్రాంతాలను హోదా పరిధిలో చేర్చవచ్చు. దీనికి అవసరమైన బిల్లును కావాలంటే లోక్‌సత్తా తయారుచేసి ఇస్తుందని తెలిపినా ఇందుకు కూడా ఏపీ ప్రభుత్వం స్పందించలేదు.

### రాయితీలు ఉంటే చిన్న యువ ఔత్సాహికులకూ పెద్ద అవకాశాలు

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కె.

తారకరామారావులాగే చంద్రబాబు కూడా పెట్టుబడుల కోసం పెద్ద ప్రయత్నాలే చేస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రావటం లేదు. దీనికి చంద్రబాబును తప్పుపట్టలేం. కానీ పన్ను రాయితీల కోసం ఒక హక్కుగా పట్టుబట్టే అవకాశమున్నా జారవిడుస్తూ పరోక్షంగా కొత్త పరిశ్రమల ఏర్పాటుని తానే దెబ్బతీయటాన్ని మాత్రం సహించలేం. 517 పారిశ్రామిక యూనిట్లు రూ. 1,43,633కోట్లతో దాదాపు మొదలవనున్నాయని, 2,23,385మందికి ఉపాధి లభించనుందని, ఇంకా లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని కొందరు తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. కానీ వాస్తవంలో పెట్టుబడుల ఊపు, ఉద్యోగాల సంఖ్య మందగమనంలో ఉందని అధికారులే చెబుతున్నారు. పరిశ్రమలను, ఉద్యోగాలనిచ్చే హోదా పన్ను రాయితీల్ని డిమాండ్ చేయకుండా 2015 విశాఖ భాగస్వామ్య సదస్సులో రూ. 4.67లక్షల కోట్లతో 328 పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, 10లక్షలకు పైగా ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే.. చివరికి రూ. 46,343కోట్ల పెట్టుబడులతో 43,392 ఉద్యోగాలు వచ్చే 26 ఒప్పందాలు అమలైతే సదస్సు గొప్ప విజయం సాధించినట్టేనని అధికారవర్గాలు తేల్చిచెబుతున్నాయి. సులభంగా వాణిజ్యం చేయటం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో భారతదేశమే పెద్ద ఆశాజనకంగా లేదని అంచనాలు చెబుతున్న తరుణంలో.. దేశంలో ఏపీ, తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచాయని ఈ విదేశీ పెట్టుబడుల యుగంలో మరీ ఎక్కువ సంబరపడలేము గదా! మరోవైపు, సులభ వాణిజ్యంపై ఎన్‌సీఏఈఆర్ (నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చి) సర్వే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ నెంబర్‌వన్ ర్యాంకుకు విరుద్ధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వున్న అవినీతి, రాజకీయ వాతావరణం, కార్మిక స్థితిగతుల వల్ల అక్కడ వ్యాపారాన్ని ఇప్పట్లో విస్తరించాలనుకోవటం లేదని పలువురు వాణిజ్యవేత్తలు భావిస్తున్నట్టు సర్వే తెలిపింది. (వ్యవసాయంలో కూడా సంస్కరణలపై ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం కితాబునిస్తే, ఏపీ ప్రభుత్వమే ఏర్పాటు చేసిన 'సెస్' కమిటీ నివేదిక సాగురంగం తీవ్రసంక్షోభంలో ఉందని తేల్చటం గమనార్హం). రాష్ట్రంలో అవినీతి భయంకరంగా వేళ్లూనుకుందని 74.3శాతం మంది వాణిజ్యవేత్తలు అభిప్రాయపడ్డారు. అయితే, పెట్టుబడిదారులు ఇంకా ఆశావహ ధోరణితో వేచిచూడాలనుకుంటున్నట్టు ఎన్‌సీఏఈఆర్ సర్వే తెలిపింది.

అవినీతి నిరోధానికి 'పౌర సేవల చట్టం' (సర్వీస్ గ్యారంటీ) వంటి ఏర్పాట్లు, ఇతర సంస్కరణలతోపాటు పాటు హోదా రాయితీలు ఉంటే చంద్రబాబు పెద్ద తిరగాల్సిన అవసరం లేకుండానే పెట్టుబడులు, ఉద్యోగాలు పెరిగేవనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక సాయాన్ని చట్టబద్ధం చేసి అమలుచేసినా, ఆ రుణ రాయితీలు పెద్ద పారిశ్రామికవేత్తలకే పోతాయి తప్ప ఉద్యోగావకాశాల్ని పెంచే స్వదేశీ యువ ఔత్సాహికులకు, మధ్య,పేద తరగతులవారికి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అందే అవకాశాలు తక్కువ. వ్యవసాయానికి ఏమాత్రం సాయం ఉండదు. తమకు నచ్చని శాఖలకు బడ్జెట్ కేటాయింపుల్ని ఎంత చక్కగా పాలకులు పక్కకు మళ్లిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. కేంద్రం ప్రత్యేకసాయం ఒకవేళ పూర్తిస్థాయిలో అందినా ఇప్పుడున్న రహస్య పాలన ధోరణుల్నే తప్ప ప్రజాప్రయోజనాలను పెంచలేదు.

**పవన్ సహా ప్రతిపక్షాల పోరాటాల్లో స్పష్టత కావాలి.. రాజకీయల లబ్ధిని వీడి పత్యామ్నాయాలనూ పరిశీలించాలి**

విభజనకు అనుకూలమని చెప్పిన పార్టీలకు ఓట్లు వేసి, తెలంగాణలోని ప్రజల్లో అత్యధికులు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నప్పుడు, కేంద్రంలోని ప్రధాన పార్టీలు విభజనకు అనుకూలంగా ఉన్నప్పుడు, రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవం కానప్పుడు విభజన అనివార్యమని, విడిపోతే ఏపీకి ఏం కావాలో ప్రతిపాదించేందుకు .. విభజన తర్వాత పోలవరం సహా విభజన చట్టం, ప్రత్యేక హోదా హామీల అమలుకు తెలుగు తేజం, తెలుగు భవిత వంటి కార్యక్రమాల ద్వారా లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేసింది. దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, సభలు, కరపత్రాలు, ఇతర మార్గాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరించే ప్రయత్నం చేసింది. కానీ మా గొంతును వినపడనివ్వలేదు, వినిపించే అవకాశం వచ్చినచోట్ల చాలలేదు. వైకాపా, వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధనా సమితి వంటి సంస్థలు, దీక్షలు, ప్రైవేటు బిల్లు వంటి రూపాల్లో కాంగ్రెస్ నేతలు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తదితరుల కృషి వల్ల ప్రత్యేకహోదా బలమైన డిమాండ్‌గా రూపుదిద్దుకుంది. కానీ లక్ష్యసాధన మార్గం పట్ల, ఐక్యపోరాటం పట్ల వారి పోరాటాల్లో స్పష్టత కొరవడుతోంది. చాలామందికి రాజకీయ లబ్ధి తప్ప ప్రజాప్రయోజనాలు పట్టటం లేదు. ప్రత్యేకహోదా ఇవ్వటానికి కొన్ని సమస్యలున్నాయని కేంద్రం అన్నప్పుడు, ప్రత్యామ్నాయాన్ని సూచించకుండా ఒకటే డిమాండ్ కోసం పట్టుబడుతున్నారు. వెనకబడిన జిల్లాలకు ప్రత్యేకహోదా అన్న లోక్‌సత్తా ప్రత్యామ్నాయాన్ని కూడా వీళ్లు పట్టించుకోవటం లేదు. హోదాపై మాట తప్పినందుకు, ఎందుకు ఆ హామీని నెరవేర్చలేకపోతున్నారో సరైన కారణాలు చూపలేనందుకు పాలక పక్షాల సంగతిని ప్రజలు వచ్చే ఎన్నికల్లో తేల్చుకుంటారు. కానీ మనకున్న పరిధిలో సరైన ప్రత్యామ్నాయాలతో ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం చేకూరేలా చేయటం మన కర్తవ్యమని ప్రతిపక్షాలు మర్చిపోకూడదు. హోదాపై పవన్ సభలకు లోక్‌సత్తా పూర్తి మద్దతునిస్తోంది. కానీ ఆయన సరైన పరిష్కారాల మీద దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు, పవన్ కళ్యాణ్ ఎక్కడ మైలేజిని కొట్టేస్తారోనన్న భయంతో

వైకాపా నేత వైఎస్ జగన్ ఎత్తుగడలతో ఈ సమస్యపై ఆందోళనలు చేస్తున్నారు. పవన్ భాషలోనే మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. చివరికి 2019 ఎన్నికలకు కూడా లోక్‌సత్తా నినాదమైన 'ప్రత్యేక హోదా'యే ఏపీకి ప్రధాన ఎజెండాగా మారేట్టు కనిపిస్తోంది. ఈ హామీని ఈ సరికే నెరవేర్చుకుని అభివృద్ధి, యువతకు ఉద్యోగాలతో ముందుకు దూసుకెళ్లాల్సిన నూతన ఆంధ్రప్రదేశ్ ఇంకా పాత డిమాండ్ చుట్టూనే తిరగాల్సి రావటం చాలా బాధాకరం. విడిపోతే మిగిలిన ఏపీకి వచ్చే ఆదాయ లోటుపై జనవరి 2014లో లోక్‌సత్తా బైటపెట్టిన లెక్కల్ని, ప్రతిపాదించిన ప్రత్యేక హోదాని పార్లమెంటు దాకా తీసుకెళ్లి ఫిబ్రవరిలో ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ నుంచి హామీని రాబట్టటంలో కొందరు కాంగ్రెస్ నేతలతోపాటు అభినందనీయ పాత్ర పోషించిన వెంకయ్యనాయుడికి ఇవన్నీ తెలియకకాదు. కానీ ఆయన రాజకీయ చట్రంలో పరిమితమైపోయారు. ఇప్పుడు ఆయన వక్రీకరణలు చేయకుండా ఉంటే రాష్ట్రానికి ఎంతో మేలు చేసినట్టే.

ఇప్పుడు పన్ను రాయితీలు ఉన్న హోదా రాష్ట్రాలకు కూడా ఎత్తివేస్తున్నారు, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీకి ఎలా ఇస్తారు? అని అధికార పక్షం వారు అడ్డంగా వాదిస్తున్నారు. 'అయ్యా! ఇప్పటికే ఆ రాష్ట్రాలకు దాదాపు 16 ఏళ్ల మేర రాయితీలు లభించాయి. మనకి కూడా శాశ్వతంగా రాయితీలు ఇవ్వమని అడగటంలా. 15–20 ఏళ్లు మాత్రమే ఇవ్వమని అడుగుతున్నాం. అది కూడా ఇతర రాష్ట్రాల నుంచి పరిశ్రమలు తరలిరాకుండా, కొత్తగా పెట్టే పరిశ్రమలకు మాత్రమే ఇవ్వమని అడుగుతున్నాం. జయలలిత కూడా తమిళనాడుకు ఇబ్బంది లేకుండా ఏపీకి రాయితీలు ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నట్టే లేఖ రాశారు.' దేశంలో ఎక్కడా లేని విధంగా అంటే, దక్షిణాదిన, ఆ మాటకొస్తే దక్కను ప్రాంతంలో ఒక్క రాష్ట్రానికైనా ప్రత్యేకహోదా ఇచ్చారా? కనీసం ఆ ప్రయోజనాల్ని అందించే ప్రయత్నం చేశారా? పెట్టుబడులపై పన్నులు వసూలు చేస్తున్నారుగానీ రాయితీలు ఇవ్వటం లేదు. 'దక్షిణాదివారికి ఇంతవరకూ హోదా లేదు కాబట్టి మనం ఇతర రాష్ట్రాలకు అభ్యంతరాలు లేనిరీతిలో అడగగలిగితే తప్పక సాధించుకునే అవకాశముందని' ఏపీలో ప్రత్యేకహోదా ప్రతిపాదన చేసినప్పుడు కూడా జేపీ సభలో చెప్పారు. అలాగే నీతి ఆయోగ్ ఏర్పడకముందు ప్రణాళికా సంఘం ఇంకా కొనసాగుతున్నప్పుడే లోక్‌సత్తా 'తెలుగు భవిత' కార్యక్రమం ద్వారా హోదా కోసం పోరాటం ప్రారంభించింది. అన్ని పార్టీలనూ కలుపుకుని కేంద్రంపై పోరాడాలని అధికార తెలుగుదేశాన్ని కోరింది. కానీ స్పందన లేదు. ఇప్పుడేమో ప్రణాళికా సంఘం లేదు, హోదా ఉన్న రాష్ట్రాలకే రాయితీలు ఎత్తేస్తున్నారు అంటూ కుంటిసాకులు చెబుతున్నారు. రెండున్నరేళ్లు అన్ని అవకాశాలనూ వదిలేస్తూ 'హోదా ఇదిగో వస్తోంది, అదిగో వస్తోంది అంటూ మభ్యపెట్టారు. ఇంతకాలం తాత్సారం తర్వాత.. హోదా సాధ్యం కాదు అని కేంద్రం చేత లీకులు ఇప్పించి ఇప్పుడు పన్ను రాయితీలు లేకుండానే హోదాను మించిన సాయం ఇచ్చారనటం పచ్చి దగా కాదా?

**80–100 వెనకబడిన జిల్లాలు, మెట్టప్రాంతాలకు పన్ను రాయితీలు కల్పించమని అడుగుదాం**

**నీతి ఆయోగ్, జీఎస్టీ జమానాలో కేంద్రానికి కూడా ఉపయోగపడే ప్రతిపాదన అవుతుంది**

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు గతంలో చేసినట్టు ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా వంటి తప్పిదాలు చేయకుండా అప్రమత్తమై కలసికట్టుగా పకడ్బందీ వ్యూహాన్ని రూపొందించుకోవాలి. "పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా లేదా పేరు మార్చినా ఆ రాయితీలతో కూడిన సహాయాన్ని కేంద్రం చట్టబద్ధంగా అందించేలా చేయాలి. ఇందుకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా 80–100 వెనకబడిన జిల్లాలకు, మెట్ట ప్రాంతాలకు హోదా వంటి ప్రత్యామ్నాయాల్నీ కేంద్రానికి సూచించాలి. ప్రణాళికా సంఘం పోయి నీతి ఆయోగ్ వచ్చినా, జీఎస్టీ వచ్చినా వెనకబడిన ప్రాంతాలకు ఏదోకరూపంలో సాయం అవసరం కాబట్టి, ఇది కేంద్రానికి కూడా ఉపయోగపడే ప్రతిపాదనే అవుతుంది. కాబట్టి మనరాష్ట్ర పాలకులకు, ఎంపీలకు చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే కచ్చితంగా వెనకబడిన జిల్లాలకు రాయితీల ప్రతిపాదనపై కేంద్రాన్ని ఒప్పించి ఆచరణలోకి తేవచ్చు".

ఏపీకి 'ట్యాక్స్ ఫ్రీ' వెసులుబాటుని సాధించేలా అన్ని పార్టీలనూ, సంఘాలను కలుపుకుని ఈ డిమాండ్ సాధనకు సారథ్యం వహించటానికి చంద్రబాబు ముందుకొస్తే సరేసరి, లేదంటే ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై ఇందుకు పోరాడాలి. ఇందులో లోక్‌సత్తా తన వంతు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. జేపీ 2014లో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనట్టయితే, అసెంబ్లీలో చేసినట్టే పార్లమెంటులోనూ కృషి చేసి తెలుగు వారికి రావలసినవన్నీ సాధించివుండేవారు. ఆ అవకాశం లేకపోవడం వల్లే ఈవేళ ఇన్నిసార్లు ఈ అంశం మీద అందరినీ బతిమిలాడుకోవాల్సి వస్తోంది. రౌతు ఓడు అయితే గుర్రం మూడు కాళ్లతో పరిగెడుతుంది, గాడిదలు గుర్రాల్లా భ్రమింపచేస్తుంటాయి. తమ ప్రయోజనాల కోసమైనా ప్రజలు రాజకీయాల్ని కొంత ఆలోచనతో పట్టించుకోవాలి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సు, నీతి ఆయోగ్ ద్వారా కేంద్రం నుంచి పెరిగిన నిధులను తీసుకుంటూనే, పోలవరాన్ని వేగంగా పూర్తిచేసేలా పోరాడుతూనే "ప్రత్యేక తరగతి హోదా పారిశ్రామిక పన్ను రాయితీలు సాధించేందుకు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, వికేంద్రీకరణ, అవినీతి లేకుండా చట్టబద్ధపాలనతో అన్ని జిల్లాలూ అభివృద్ధి చెందేందుకు పోరాడే వారికే అండగా నిలవడం" ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందున్న సరైన కార్యాచరణ. ★

# రాష్ట్ర విభజన సమయంలో ఏపీ ప్రజల ఆర్థిక భవిష్యత్తుని కాపాడిన లోక్‌సత్తా

**- లోక్‌సత్తా పార్టీ టీం ఆంధ్రప్రదేశ్**

ఓట్లు, సీట్లు, కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, దోచుకోవటం, దాచుకోవటం కోసం ప్రజలు నాశనమైనా ఫర్వాలేదనుకుని బరితెగించి రాష్ట్రంలోని, కేంద్రంలోని పార్టీలు ఆడిన వికృత రాజకీయ క్రీడలో కొట్టుకుపోవటం వల్లే 2014 రాష్ట్ర విభజన సమయంలో నూతన ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు తగిన చోటు లభించలేదు.

కేవలం 2004 ఎన్నికలలో గెలవటం కోసం కాంగ్రెస్ తెలంగాణ వాదాన్ని రాజేసి, 2009 ఎన్నికల కోసం తెలుగుదేశం దాన్ని కొనసాగించి, జాతీయ ప్రతిపక్షం బీజేపీ కూడా తెలంగాణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించి, తెలంగాణ ప్రాంత ప్రజలలో బలమైన ఆకాంక్ష తలెత్తి, ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రాన్ని ఇష్టమొచ్చినట్టు విభజించుకోండని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేఖ ఇచ్చి, ఆ పార్టీలకే కోస్తాంధ్ర, రాయలసీమ వాసులు కూడా ఓట్లు వేసి, ఉద్యమాలతో నాలుగున్నరేళ్లుగా పాలనస్తంభించి జనం జీవితాలు చితికిపోతున్న సమయంలో – రాజకీయంగా తనకు తక్కువ బలమే ఉన్నా తెలుగు ప్రజల సంక్షోభాన్ని పరిష్కరించే చారిత్రక బాధ్యతను లోక్‌సత్తా భుజాన వేసుకుంది. రాజ్యవ్యవస్థ మారకుండా ఎన్ని రాష్ట్రాలు ఏర్పడినా ప్రయోజనముండదని భావించే లోక్‌సత్తా పార్టీ, తెలుగు ప్రజల భవిష్యత్తు ముళ్ల మీద బట్టలాగా మారటంతో ఒడుపుగా దాన్ని బైటికిలాగుతూ రాష్ట్ర సంక్షోభానికి సమగ్ర, సామరస్య పరిష్కారం కోసం కార్యాచరణ ప్రారంభించింది. లోక్‌సత్తాకు ఓటు వేస్తే వేస్టు అనుకుంటూ ప్రజలు ఒకే ఒక్క ఎమ్మెల్యేను గెలిపించినా ఆ ఒక్క ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ మూడు ప్రాంతాలకూ న్యాయం చేసే పరిష్కారాన్ని జనవరి 18,2014న తెలుగు ప్రజల అత్యున్నత వేదికైన రాష్ట్ర శాసనసభలోనే ప్రకటించారు.

"తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షల్ని నెరవేరుస్తూనే రాయలసీమ, కోస్తాంధ్రకు ధోకా లేకుండా మూడు ప్రాంతాల తెలుగు ప్రజలందరి ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించేలా" జేపీ పరిష్కారం వెలువరించారు.

గదిలో ఏనుగు ఉంది, లేనట్టు నటించొద్దు, అసెంబ్లీలో రాష్ట్ర విభజన సమస్యను చర్చించి తెలుగు గడ్డ మీదే పరిష్కరించుకుందామని జయప్రకాష్ నారాయణ్ 2009 నుంచి చెబుతున్నా ఏ పార్టీ పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా సభ నడవకుండా అడ్డుకున్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో తాకట్టు పెట్టి, పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు ఢిల్లీ చేతికి తెలుగు వాళ్ల భవిష్యత్తుని అప్పచెప్పాయి. జేపీ ఒకే ఒక్క ఎమ్మెల్యే అయినా మెజారిటీలా వ్యవహరిస్తూ పరిష్కారం కోసం దీపస్తంభంలా నిలబడ్డారు. చిత్తశుద్ధి, పరిణతి, సామర్థ్యం, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటం, ప్రజల పట్ల ప్రేమే ఆయనకు ఇంధనాలు. కేసులకు భయపడి ఒకరు, అవినీతిని కప్పిపుచ్చుకోవటానికి ఇంకొకరు, పదవుల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు... ఇలా ప్రాబల్యం గల పార్టీలన్నీ మనల్ని మోసం చేశాయి. బ్రహ్మాస్త్రాలు, సిక్సర్లు అంటూ జనాన్ని చివరిదాకా దగా చేసి చివరకు ఆ పార్టీల నేతలు పలాయనం చిత్తగించారు.

రాష్ట్రం విడిపోక తప్పని పరిస్థితి వచ్చాక, హైదరాబాద్ వంటి మహానగరం అండ లేకపోవటం వల్ల, సాగు నీటి విషయంలో రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల ప్రజలకి, ముఖ్యంగా యువతకి ఎలాంటి నష్టం లేకుండా ఉండేందుకు కొన్ని పరిష్కార ప్రతిపాదనల్ని తయారుచేసి లోక్‌సత్తా పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ వరకూ శక్తికి మించి కృషి చేసింది. వెనకబడిన ఉత్తర తెలంగాణలో మౌలిక వసతుల ఏర్పాటు కూడా లోక్‌సత్తా ప్రతిపాదనల్లో భాగంగా వున్నాయి. రాష్ట్రపతిని, కేంద్ర ప్రభుత్వ నేతలను, ప్రధాన ప్రతిపక్ష నేతలను పలుమార్లు కలిసి లోక్‌సత్తా సవరణలకు వారిని ఒప్పించింది.

అడ్డగోలుగా రాష్ట్రాన్ని నరికేద్దామనుకున్న కేంద్రం లోక్‌సత్తా కృషి వల్ల విచక్షణలోకి వచ్చింది. లోక్‌సత్తా సవరణల్నే తీసుకున్న బీజేపీ లోక్‌సభలో రాజకీయ కారణాల వల్ల వెనక్కి తగ్గినా, చివరకు రాజ్యసభలో వాటి కోసం పట్టుబట్టింది.

2014 రాష్ట్ర విభజనలో కోస్తా, సీమకి ఎటువంటి నష్టం లేకుండా పదేళ్ల తర్వాత తలెత్తుకుని బతికేలాగా ఆర్థిక భవిష్యత్తుకి పూర్తి భరోసా లభిస్తోందంటే అది ప్రధానంగా లోక్‌సత్తా చేసిన కృషి వల్లే.

జేపీ ఎంతో ప్రయత్నం చేసి ఈ చారిత్రక సందర్భంలో మన కోసం మంచి ఫలితాలు సాధించారు. మరెన్నో సాధించాలి. రాష్ట్ర విభజన వల్ల కలిగే సమస్యలను తొలగించటానికి జేపీ చేసిన ప్రయత్నాలు, సాధించిన విజయాలు ఇవీ...

**1. హైదరాబాద్ లేకపోతే మనకు ఉద్యోగాలు, వ్యాపారాలు ఎలా?**

**జేపీ పరిష్కారం:** హైదరాబాద్ భారతీయులందరిదీ. ఎవరైనా స్వేచ్ఛగా ఇక్కడ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవచ్చు. నానాటికీ తగ్గిపోతున్న ప్రభుత్వోద్యోగాలలో అవకాశం ఉండదుగానీ రోజురోజుకీ పెరిగే ప్రైవేటు ఉద్యోగాలకు ఏ సమస్యా ఉండదు. వెనకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమలో 20 ఏళ్ల పాటు పూర్తి పన్ను రాయితీలు ఇచ్చి, ఆ తర్వాత 30 ఏళ్లపాటు కూడా కొంతమేర కొనసాగించి, కృష్ణా డెల్టాలో రామాయపట్నం మేజర్ పోర్టుని కేంద్రమే ఏర్పాటు చేస్తే హైదరాబాద్ మీద ఆధారపడకుండా లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయి.

**సాధించిన విజయం:** కేంద్ర ప్రభుత్వం దీనికి ఒప్పుకుంది. మనం అప్రమత్తంగా ఉంటూ ఒత్తిడి తెచ్చి అమలు చేయించుకోవాలి.

**2. హైదరాబాద్ ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడిపేదెలా? జీతాలు ఎలా?**

**జేపీ పరిష్కారం:** తెలంగాణకి రాజధానిగా ఉండే హైదరాబాద్ ఆదాయాన్ని పంచుకుంటే చాలనుకుంటే మరోసారి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఇది నష్టదాయకంగా మారుతుంది. కాబట్టి వచ్చే పదేళ్లూ మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడే లోటును పూడ్చటానికి కేంద్రం బడ్జెట్‌లో, ప్రణాళికా సంఘం ద్వారా గ్యారంటీ ఇవ్వాలి. హైదరాబాద్‌లోని మిగులు దక్కని కారణంగా వచ్చే రెవిన్యూ లోటుని భర్తీ చేయటం కేంద్రం బాధ్యత.

**సాధించిన విజయం:** రెవిన్యూ లోటు భర్తీకి కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంది. ఆంధ్రప్రదేశ్‌కి వనరులు కొరత ఉండదు.

**3. తాత్కాలికంగా ఆర్థిక లోటు పూడినా రాష్ట్రాభివృద్ధి ఆగిపోతుంది గదా?**

**జేపీ పరిష్కారం:** సుమారు 30 ఏళ్లపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ ప్రాంతం అత్యంత వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోవటం విషాదకరం. ఇంతకంటే ఎంతో మెరుగ్గా ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం రాష్ట్రాలకు ఎలాగైతే ప్రత్యేక ప్రతిపత్తి హోదా ఇచ్చి కార్పొరేట్, ఎక్సయిజ్,పెట్టుబడి, రవాణా రాయితీలు ఇస్తున్నారో అలాగే రాయలసీమకి కూడా ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించి ఇవ్వాలి. ఇంతవరకూ దక్షిణాదిన, ద్వీపకల్ప భారతదేశంలో ఇలాంటి ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలు లేవు. దీనివల్ల రాయలసీమకు దూర ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి భారీ అభివృద్ధి చోటుచేసుకుంటుంది. పొరుగు రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు కాకుండా కొత్తగా పెట్టే ఇండస్ట్రీలకే పన్ను రాయితీలు ఇవ్వాలి. హోదాతో రాయలసీమ మరో దుబాయ్‌లా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

**సాధించిన విజయం:** ఐదేళ్ళవరకూ ప్రత్యేక ప్రతిపత్తికి కేంద్రం అంగీకరించింది. మనం ఒత్తిడి తెచ్చి పదేళ్ళకు పెంచుకోవాలి.

**4. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల భద్రత?**

**జేపీ పరిష్కారం:** రాజ్యాంగం ఇందుకు గ్యారంటీ ఇస్తున్నా, మానసిక భరోసా కోసం హైదరాబాద్ పరిధిలో శాంతిభద్రతలను గవర్నర్‌కి అప్పగిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి

**సాధించిన విజయం:** దీన్ని ప్రభుత్వం చట్టంలో చేర్చింది. ఒకవేళ కోర్టులు దీన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తే, తగిన రాజ్యాంగ సవరణ కూడా చేస్తామని ప్రభుత్వం, ప్రతిపక్ష బి.జె.పి కూడా అధికారికంగా అంగీకరించాయి. (కానీ అంత అవసరం రాలేదు. ఇలాంటి భయాలతో హైదరాబాద్ ప్రజల మధ్య చిచ్చుపెట్టవద్దని ఓటుకు కోట్లు కేసు సందర్భంగా జేపీయే ఆ తర్వాత ఏపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ఇచ్చిన గ్యారంటీ పరిధిలోనే హైదరాబాద్‌లో ప్రజలు సామరస్య జీవితం గడుపుతున్నారు)

**4. హైదరాబాద్‌లో ఉన్న విద్యాసంస్థలతో ప్రవేశాలు కోల్పోతే?**

**జేపీ పరిష్కారం:** పదేళ్ల పాటు హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలలో కోస్తా, సీమ విద్యార్థులను స్థానికంగానే గుర్తించాలి.

**సాధించిన విజయం:** ప్రభుత్వం అంగీకరించింది.

**5. మిగులు జలాల మీద నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు ఆగిపోతాయేమో?**

**జేపీ పరిష్కారం:** మిగులు జలాల ఆధారంగా ఇప్పుడు నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టుల్నీ నికర జలాలు ఆధారంగా, కొత్త రాష్ట్రం అడ్డుకోకుండా చట్టబద్ధ ఏర్పాట్లు

**సాధించిన విజయం:** కేంద్రం ఒప్పుకుంది. తెలంగాణ, మిగిలిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఒకరి ప్రాజెక్టులను ఇంకొకరు అడ్డుకోలేవు

**6. పోలవరం పూర్తవుతుందా?**

**జేపీ పరిష్కారం:** పోలవరంబహుళార్థ సాధక ప్రాజెక్టుకు రెండు రాష్ట్రాలూ అంగీకరించినట్టుగా చట్టబద్ధ ఏర్పాట్లు చేసి, భద్రాచలం డివిజన్‌లోని ముంపు మండలాలను మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో కలపాలి.

**సాధించిన విజయం:** ప్రభుత్వం ఒప్పుకుంది.

**8. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబడ్డ ప్రాంతాలు. వాటి తక్షణ అభివృద్ధి ఎట్లా?**

**జేపీ పరిష్కారం:** ఈ రెండు ప్రాంతాలకీ, ఉత్తర తెలంగాణకీ ప్రత్యేకంగా అభివృద్ధి నిధులు కేంద్రం నుండి అదనంగా వచ్చే ఏర్పాటు చేయాలి.

**సాధించిన విజయం:** కొంతమేర మాత్రమే అనుకున్నది సాధించగలిగాం. బుందేల్‌ఖండ్‌తో సమానంగా ఈ వెనకబడ్డ ప్రాంతాలకీ నిధుల్ని కేటాయించటానికి కేంద్రం అంగీకరించింది. (ఏపీకి ప్రత్యేక తరగతి హోదా సాధ్యం కాదని ప్రభుత్వాలు తేల్చటంతో ప్రత్యామ్నాయంగా సీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా వెనకబడిన జిల్లాలకు హోదా కల్పించాలని ఇప్పుడు లోక్‌సత్తా కోరుతోంది).

**9. కొత్త రాజధాని ఏర్పాటు, రాజధాని నుండి హైదరాబాద్‌కి రవాణా ఎలా?**

**జేపీ పరిష్కారం:** రాజధాని నిర్మాణానికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి కేంద్రమే నిధులు ఇవ్వాలి.

**సాధించిన విజయం:** కేంద్రం ఒప్పుకుంది

**10) సీమాంధ్ర ప్రాంతాలలోని విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల కల్పన ఎట్లా?**

**జేపీ పరిష్కారం:** రెండింటికీ నిర్దిష్టకాలంలో పూర్తిచేసేందుకు కేంద్రం నిధుల్ని ఇవ్వాలి.

**సాధించిన విజయం:** కేంద్రం ఒప్పుకుంది.

**ఇక బాధ్యత మన చేతుల్లో ఉంది**

రాష్ట్ర విభజన వల్ల సంక్షోభాన్ని ఎలాగోలా అందరినీ ఒకచోట చేర్చి పరిష్కరించుకుంటాం. కానీ అసలెందుకీ దురవస్థ వచ్చిందో ఇప్పటికైనా కళ్లు తెరిచి గుర్తించకపోతే భవిష్యత్తు మనల్ని క్షమించదు. అవకాశవాద, కుటుంబ, వ్యాపార రాజకీయాల పార్టీల దగా వల్ల, ప్రజలుగా మనం రాజకీయాల్ని సీరియస్‌గా పట్టించుకుని సరైనవారికి ఓటు వేయకపోవటం వల్లే ఈవేళ కోస్తాంధ్ర, రాయలసీమ తీవ్రంగా నష్టపోయాయి. సుమారు 1000 కిలోమీటర్ల తీరప్రాంతం, గుజరాత్, ఇజ్రాయిల్ కంటే ఎక్కువ వర్షపాతం, అపార ఖనిజ వనరులున్న రాయలసీమ వంటి ప్రాంతం, అద్భుత చైతన్యం, ఎన్నో ఆకాంక్షలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సత్తా కలిగిన సీమాంధ్ర ప్రాంతం ఎందుకింత దయనీయ నిస్సహాయ పరిస్థితి? విజయవాడ, కర్నూలు, శ్రీకాకుళం 30 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాయో దాదాపుగా అలాగే ఉన్నాయి. భూముల కబ్జాలో తప్ప ఎక్కడా పురోగతి లేదు. రైతులకి లాభసాటి ధర రాదు, పిల్లలకి మంచి చదువు అందదు, యువతకు మంచి ఉద్యోగాలు వచ్చేందుకు పరిశ్రమలు లేవు. చేసిన కాస్త అభివృద్ధినీ హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకరించటం వల్లే ఈవేళ ఆరు కోట్ల ఆంధ్రుల జీవితాలలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

విభజన సమయంలో కూడా ఈ ప్రాంతం ఎన్నుకున్న 175 ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపీలు ప్రజల్ని మోసం చేశారు. రాష్ట్రాన్ని కలిపి ఉంచలేకపోయారు, విడిపోవటం అనివార్యమైనప్పుడు కోస్తా, సీమ ప్రయోజనాలనూ కాపాడలేకపోయారు. చివరిదాకా సమైక్యవాద హీరోలమంటూ నటించారు.

మనం కోస్తాంధ్ర, రాయలసీమల్లో లోక్‌సత్తా పార్టీ తరుపున ఒక్క ఎమ్మెల్యేని, ఎంపీని గెలిపించకపోయినా, లోక్‌సత్తా పార్టీ తన శక్తికి మించి పనిచేసి ఈ ప్రాంతాల ప్రయోజనాలను కాపాడింది.

లోక్‌సత్తా కృషి వల్ల గతం కంటే మరింత ఆర్థికబలానికి కోస్తాంధ్ర, రాయలసీమకు హామీలు సమకూరాయి. వాటిని సాధించుకుంటూ, భవిష్యత్తుని ఒక సవాలుగా తీసుకుని, రాజకీయాన్ని మార్చుకుని, నిజాయతీ, పరిణతి, సామర్థ్యంగల నాయకత్వాన్ని పెంపొందించుకుని, ఓటు వేస్టు వంటి భ్రమల్ని పక్కనబెట్టి సరైన అభ్యర్థికి, పార్టీకీ వేస్తేనే మనందరి ఆకాంక్షలూ నెరవేరతాయి. ఇలా పోటాపోటీగా అభివృద్ధి చెందితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోనే అగ్రస్థానాన్ని అందుకోగలవు. ★



# ఉద్యోగ సంక్షోభం చుట్టుముడుతోంది,

## సీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలకైనా 'హోదా' పన్ను రాయితీలు ఇవ్వండి: జేపీ



యువతలో పెరుగుతున్న ఉద్యోగ సంక్షోభ రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ ప్రత్యేక తరగతి హోదా వచ్చే అవకాశం లేదని తేలిపోయిందని, కనీసం వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాలకు హోదా పారిశ్రామిక పన్ను రాయితీల్ని ఇస్తే రాష్ట్రంలో ఉద్యోగాలు పెద్దఎత్తున ఏర్పడతాయన్నారు. సీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వెనకబడివున్నాయని కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకుందని, వీటికి హోదా ఇచ్చి పార్లమెంటులో, ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నిలబెట్టుకోవడానికి అభ్యంతరమేమిటని ప్రశ్నించారు.

వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు కడప జిల్లాకు వచ్చిన జేపీ మీడియాతో మాట్లాడారు. లోక్‌సత్తా నేతలు, 'పీపుల్ అగనెస్ట్ కరప్షన్' సంస్థ అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి కార్యక్రమాలను సమన్వయం చేశారు. డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, బాలాజీ తదితరులు కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రం విడిపోవటం వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఏపీకి ఆర్థిక అండనివ్వడానికి 'ప్రత్యేక తరగతి హోదా' ప్రతిపాదనను మొట్టమొదట తానే చేశానని, అయితే రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా అంటే ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశమున్నందున రాయలసీమ వరకే కోరుతూ గణాంకసహితంగా అసెంబ్లీలో ప్రతిపాదించానని జేపీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు ప్రత్యేక సాయం కోరానన్నారు.

ఏపీ మొత్తానికీ హోదా ఇవ్వటం సాధ్యంకాదంటున్నందున ఇప్పుడు వెనకబడిన జిల్లాలకు ఇవ్వమని ప్రత్యామ్నాయంగా అడగాలన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా పారిశ్రామిక పన్ను రాయితీలు ఇవ్వటాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత వ్యతిరేకించలేదని, కాకపోతే దానివల్ల తమ రాష్ట్రంలోని పెట్టుబడులకు నష్టం వాటిల్లకుండా చూడాలని మాత్రమే కోరారని జేపీ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పరిష్కార అవకాశాల్ని, ప్రత్యామ్నాయాల్ని పట్టించుకోకుండా ఉద్యోగాలు లేని అభివృద్ధి లెక్కల్ని ఏకరువుపెడుతున్నాయన్నారు. యువత సొంత కాళ్ల మీద నిలబడే అవకాశాలు లేకుండా నిర్వీర్యమయ్యేలా తాత్కాలిక తాయిలాలను ఉద్యోగాలకు ప్రత్యామ్నాయంగా చూపే అభివృద్ధి నమూనాను చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇది మున్ముందు తీవ్ర ఆర్థిక, సామాజిక అసమానతలకు దారితీసి రాష్ట్రాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు.

సీమ, ఉత్తరాంధ్రకు పారిశ్రామిక రాయితీల్ని ఒక హక్కుగా




అడగాలని, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఏపీ పార్లమెంటు సభ్యులు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే ఇది పూర్తిగా ఆచరణసాధ్యమన్నారు. చిన్న పరిశ్రమలకు పన్ను రాయితీలు అందేలా చూడాలన్నారు. ఈ విషయంలో రాజకీయాలను పక్కనబెట్టి ముందుచూపుతో పనిచేయకపోతే రాష్ట్రం నష్టపోతుందని, ప్రధానమంత్రి పార్లమెంటులో ఇచ్చిన హామీ విషయంలో కూడా న్యాయం జరగలేదన్న భావం ఫెడరలిజాన్ని బలహీనపరుస్తుందని అన్నారు.

### జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి

ఏపీలో పాలన రాచరికాన్ని తలపిస్తోందని, అధికారాన్ని, అభివృద్ధిని రాజధాని చుట్టూ కేంద్రీకరించి హైదరాబాద్‌లో చేసిన తప్పే చేస్తున్నారని, ప్రజలకు పనులు ఎక్కడికక్కడ జరిగేలా 'జిల్లా ప్రభుత్వాల'ను ఏర్పాటు చేయాలని జేపీ డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలేవో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలుస్తాయని, పరిష్కారాలు వేగంగా వస్తాయని అన్నారు.

పోలవరం ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని, 175 టీఎంసీల సామర్థ్యమున్న రాయలసీమప్రాజెక్టులకు నికర జలాలు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టే కీలకమన్నారు.

### పౌరసేవల చట్టాన్ని తేవాలి

ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి అడ్డాగా మారాయని, నిర్ణీత గడువులోగా ప్రజలకు గవర్నమెంట్ ఆఫీసుల్లో పనులు చేసి పెట్టకపోతే రోజుకు కనీసం రూ. 250 పరిహారం చెల్లించే 'పౌరసేవల చట్టాన్ని' (సర్వీస్ గ్యారంటీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయాలని జేపీ అన్నారు. లోక్‌సత్తా ఇప్పటికే రూపొందించిన ఇలాంటి చట్టం పార్లమెంటు ముందు ఉందని, తెలంగాణ ప్రభుత్వానికి కూడా పంపామని తెలిపారు. ఏపీ కోరితే తయారుచేసి ఇవ్వడానికి సిద్ధమన్నారు.

### ప్రజలే హీరోలు.. ప్రశ్నించడం నేర్చుకోండి

తెలుగు సాహిత్యం, చరిత్రకు ప్రాణం పోసిన మహనీయులకు నిలయమైన రాయలసీమ గడ్డ అభివృద్ధి పట్ల పాలకులు నామమాత్రంగానే స్పందిస్తున్నారని, ఎన్నుకున్న వారి చేత సరిగా పనిచేయించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని జేపీ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే హీరోలు తప్ప అధికారులు, నాయకులు కాదన్నారు. స్థానికంగా రోడ్డు బాగు చేయటం దగ్గర్నుంచి ఓటు వేయటం దాకా ప్రజలు చురుకైన భాగస్వామ్యంతో ఉంటే నేతలు సేవకుల్లా వ్యవహరిస్తారన్నారు. సాక్ష్యాధారాలున్న అవినీతి కేసులు 800 వరకు పెండింగ్‌లో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం విచారణకు అనుమతినివ్వడం లేదని, ప్రజలు పట్టించుకోవటం మొదలుపెడితే ఇలాంటివి సాధ్యం కాదని అన్నారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా.. బద్వేలులోని శ్రీ రాచపూటి నాగభూషణం కళాశాల, శ్రీ బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గన్నారు. ఏపీలో ఒక్కో పాఠశాల విద్యార్థి మీదా ప్రభుత్వం ఏడాదికి రూ. 44,000 ఖర్చు చేస్తున్నా సరైన విద్యను అందించలేకపోతున్నారన్నారు.

### మీ జీవితాల్ని చూసుకుంటూనే సమాజం కోసం కొంత పనిచేయండి

10వ తరగతి వరకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించకపోతే వ్యక్తిగత అభివృద్ధి, ఈ దేశనిర్మాణం సాధ్యంకావవని జేపీ అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు,

సంపన్నుల పిల్లలకు రిజర్వేషన్లను వర్తింపచేయకూడదని, ఆయా కులాల్లోని పేదలకు రిజర్వేషన్లు ఇస్తే అందరూ సంతోషిస్తారని అన్నారు. ఓసీల్లోనూ నిరుపేదలు ఉన్నారని, సంపన్నుల పిల్లలకంటే పేద, మధ్యతరగతి వారి పిల్లలు ఎంతో తెలివైనవారు కూడానని అన్నారు. డబ్బున్నవారి పిల్లలకు 85శాతం మార్కులు వచ్చి, ఇతరుల పిల్లలకు 80శాతం మార్కులు వచ్చినా వీరే గొప్పవారన్నారు. వీరికి సరైన మార్గాన్ని చూపి అవకాశాలిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. బాలికలు భయపడే పరిస్థితులున్నాయని, ధైర్యంగా ప్రశ్నిస్తూ వ్యవస్థను మార్చుకుంటూ ఎదగాలన్నారు. క్రమశిక్షణతో అవగాహనతో కృషి చేస్తే మగవారి కన్నా మహిళలు ఎదగగలరన్నారు. ఇప్పుడు కాలేజీ చదువుల్లో ఉన్నవాళ్లు త్వరలో జీవితాల్లో స్థిరపడతారని, సొంత కెరీర్‌లు చూసుకుంటూనే సమాజం కోసం కొంత చేయాలని జేపీ కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. నాగలక్ష్మీరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**జాతీయ విద్యావిధానంపై పార్టీలు, పాలకులు శ్రద్ధ చూపక పోవటం బాధాకరం**

దేశాన్ని బాగు చేసేందుకు విద్య, విద్యను బాగు చేసేందుకు బహుముఖ చర్యలు అవసరమని, అయితే జాతీయ విద్యావిధానంపై పార్టీలు, పాలకులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. నూతన జాతీయ విద్యావిధానంపై గోపవరంలోని స్త్రీశక్తి కార్యాలయంలో పీపుల్ అగనెస్ట్ కరప్షన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లాగే చాలా ప్రైవేటు స్కూళ్లూ అధ్వాన్నంగా వున్నాయని, ప్రజలకు మాత్రం చదువు అందకుండా డబ్బు వదులుతోందని అన్నారు. సమాజంలో విద్యకు ఇంత డిమాండ్ వున్నా సరైన చదువును అందించని దురవస్థ రాజకీయాలు, సమాజం తీరు వల్ల కొనసాగుతోందన్నారు. సరైన బోధనా ప్రమాణాలు, పర్యవేక్షణ, ఒత్తిడి లేని పరీక్షల విధానాలు, వసతులు వంటి చర్యల మీద దృష్టిపెట్టకుండా ఉపాధ్యాయ సంఘాలు, పర్యవేక్షణాధికారులు లాలూచీ పడి విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ, విద్య మిధ్యలా మారిందన్నారు. నాణ్యమైన విద్యను అందించకుండా పాలకులు ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యావిధానంపై చర్చను అన్ని ప్రాంతాలకూ తీసుకెళ్లాలన్నారు. ఐఆర్ఎస్ అధికారి తరుణ్‌రెడ్డి గంగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ, జిల్లాలో 51మండలాలు ఉండగా, కేవలం ఆరుగురు శాశ్వత ఎంఈవోలు ఉన్నారన్నారు. ఎంపీడీవో నాగార్జునుడు, విశ్రాంత ఎంఈవో రమణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పలు కళాశాలల అధ్యాపకులు, బీసీ సంఘం మండల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ★

## ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, కేజీ నుంచి పీజీ విధివిధానాలను ప్రకటించాలి: విద్యార్థిసత్తా




ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవటం వల్ల విద్యార్థులు కళాశాలల యాజమాన్యాల నుంచి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట పవన్ డిమాండ్ చేశారు. జిల్లాలో పరిస్థితిని వివరిస్తూ, బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞాపనపత్రం ఇచ్చారు. రూ. 300, 400కోట్లు విదిలించటం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడట మేనన్నారు. విద్యాప్రమాణాల్లో నాణ్యతను పెంచి సకాలంలో ఫీజు రీ ఇంబర్స్ చేస్తేనే కళాశాలల నుంచి బైటికొచ్చినవాళ్లు పై చదువులకు వెళ్లటమో, ఉద్యోగాలు, సొంత వ్యాపారాలు చూసుకోవటమో త్వరగా చేసుకోగలుగుతారన్నారు. తెలంగాణ సమాజ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే కేజీ నుంచి పీజీ విధివిధానాలను ప్రకటించాలన్నారు. నిర్లక్ష్యంగా, మొండి వైఖరితో వ్యవహరిస్తే విద్యార్థులు పోరాటాలకు దిగటం మినహా మార్గం ఉండదని పవన్ హెచ్చరించారు. ★

# స్వాతంత్ర్యాన్ని మళ్లీ కోల్పోవద్దు

## ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వం కొనసాగే ప్రమాదం మనదేశానికి పొంచి ఉంది, స్వతంత్ర భారత ఆందోళనలు రాజ్యాంగపద్ధతుల్లో ఉండాలి

- డా॥ బీఆర్ అంబేద్కర్



జనవరి 26, 1950తో భారత్ గణతంత్రరాజ్యంగా అవతరిస్తుంది. ఈ తర్వాత దేశ భవిష్యత్తు ఎలా ఉంటుంది? తన స్వాతంత్ర్యాన్ని భారత్ నిలుపుకొంటుందా? లేక.. మరోసారి కోల్పోతుందా? నా మదిలో మెదిలిన మొట్టమొదటి ఆలోచన ఇది. భారత్ స్వతంత్రదేశంగా ఎన్నడూ లేదని కాదు. ఒకప్పుడు ఇది స్వతంత్రదేశమే. కానీ, తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. మళ్లీ అదే జరుగుతుందా? రెండోసారి కూడా భారత్ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోతుందా? ఈ ఆలోచనే నన్ను భవిష్యత్తు పట్ల ఎంతో ఆందోళనపరుస్తోంది. సింధూ ప్రాంతంపైకి మహమ్మద్-బిన్-ఖాసిం దండెత్తివచ్చినప్పుడు ఆ ప్రాంతంలోని రాజు దాహిర్ సైన్యాధిపతులే శత్రువుల నుంచి లంచాలు తీసుకొని రాజు తరపున యుద్ధం చేయటానికి నిరాకరించారు. పృథ్వీరాజ్ మీద పోరాడటం కోసం మహమ్మద్ ఘోరీని జయ్‌చంద్ స్వయంగా ఆహ్వానించి భారతదేశ ఆక్రమణకు దారివేశాడు. హిందువుల విముక్తి కోసం శివాజీ ఓవైపు పోరాడుతుంటే.. మరోవైపు ఇతర మరాఠా పాలకులు, రాజ్‌పుట్ రాజులు మొఘల్ చక్రవర్తుల తరపున యుద్ధాలు చేశారు. సిక్కు సామ్రాజ్యాన్ని సర్వనాశనం చేయటానికి బ్రిటీషువాళ్ళు ప్రయత్నిస్తుంటే.. ముఖ్య సైన్యాధిపతి గులాబ్‌సింగ్ చూస్తూ ఊరుకున్నాడు. 1857లో దేశవ్యాప్తంగా చాలాప్రాంతాల్లో బ్రిటీషువారికి వ్యతిరేకంగా విముక్తియుద్ధం ప్రారంభమైతే.. ఆనాటి పరిణామాల్ని సిక్కులు ప్రేక్షకుల్లాగా తిలకిస్తూ కూర్చున్నారు.

చరిత్ర పునరావృతమవుతుందా? నన్ను ఆందోళనకు గురిచేసేది ఆ ఆలోచనే. కులాలు, మతాలవంటి మన పాతశత్రువులకు తోడుగా.. పరస్పరం వ్యతిరేకించుకునే విభిన్నమైన అనేక రాజకీయ పార్టీలను మనం భవిష్యత్తులో చూడబోతున్నాం. భారతీయులు తమ మత విశ్వాసాలు, సిద్ధాంతాలకన్నా దేశానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారా? లేక.. దేశంకన్నా తమ విశ్వాసాలకే అధిక ప్రాముఖ్యతనిస్తారా? సమాధానం నాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం నిజం. రాజకీయ పార్టీలు దేశంకన్నా తమ సిద్ధాంతాలకే ఎక్కువ ప్రాముఖ్యతనిస్తే మాత్రం మనం రెండోసారి స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. ఇటువంటిది జరగకుండా మనమందరం జాగ్రత్తపడాలి. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటం కోసం చివరి రక్తపుబొట్టు వరకూ పోరాడటానికి కృతనిశ్చయులమై ఉండాలి.

26 జనవరి 1950 నుంచీ భారత్ ప్రజాస్వామ్యదేశం అవుతుంది. ఆరోజు నుంచీ ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ఏర్పాటవుతుంది. ఈ సందర్భంలో కూడా నా మదిలో ఇంతకుముందటి ఆలోచనలే మెదిలి వ్యాకులపరుస్తుంటాయి. భారతదేశ ప్రజాస్వామ్య రాజ్యాంగం భవిష్యత్తు ఎలా ఉంటుంది? దానిని అది నిలబెట్టుకుంటుందా? లేక కోల్పోతుందా?

### ప్రజాస్వామ్య వ్యవస్థ

భారతదేశానికి ప్రజాస్వామ్యం కొత్త కాదు. ఒకప్పుడు ఈ భూభాగంవ్యాప్తంగా గణతంత్రరాజ్యాలు ఏర్పాటైన కాలం ఉంది. బౌద్ధభిక్షువుల సంఘాలను అధ్యయనం చేస్తే.. నేటి

ఆధునికకాలంలో ఉన్న అన్ని పార్లమెంటరీ ప్రక్రియలను నాటి సంఘాల్లో ఆచరించినట్టుగా స్పష్టమవుతుంది. నిజానికి బౌద్ధసంఘాలకు నేటి పార్లమెంటుకు ఎటువంటి తేడా లేదు. సీట్ల అమరిక, తీర్మానాన్ని ప్రతిపాదించటం, తీర్మానాన్ని

## ఉద్యమ పంథాలపై నవ పరిష్కారాలకు ఐఐపీఏ పురస్కారం అందుకున్న జేపీ




అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ విధానాలతో కొత్త రాజకీయాన్ని చెప్పటమేకాకుండా, ఆచరణలో చూపింది లోక్‌సత్తా. తాజాగా ఇదే కోణంలో 'భారత ప్రజాస్వామ్యంలో పౌరసంస్థల ఉద్యమాలు – పోరాట పంథాలు' గురించి చర్చిస్తూ నవ పరిష్కారాలు అందించినందుకుగాను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాసిన వ్యాసానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) ప్రతిష్ఠాత్మక టి.ఎన్ చతుర్వేది పురస్కారం లభించింది. ఇటీవల న్యూఢిల్లీలో అవార్డును జేపీ అందుకున్నారు.

ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు సకాలంలో స్పందించలేకపోవటం, ఎన్ని రకాలుగా ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు స్పందించటంలేదంటూ జనజీవితాలకు ఆటంకం కలిగించే పోరాటపద్ధతులు పెరగటం నేపథ్యంలో.. విధానాల్లో మార్పు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవటానికి స్వచ్ఛంద సంస్థలు అనుసరించాల్సిన పద్ధతులపై జేపీ రాసిన వ్యాసాన్ని, అందులో చూపిన పరిష్కారాల్ని అత్యంత ప్రాధాన్యమైనవిగా, రాజకీయ పార్టీలకు కూడా అవసరమైనవిగా అవార్డు ఎంపిక కమిటీ భావించింది.

స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడచినా మనదేశంలో ప్రభుత్వాల పాత్ర, పౌర ఉద్యమాలు– ఆందోళనాపద్ధతులపై ఉన్న గందరగోళాన్ని వ్యాసంలో తొలుత జేపీ ప్రస్తావిస్తూ.. ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా ఎన్నికల మధ్య తమ ఇష్టాలు, అభిప్రాయాలకనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ, ఇందుకోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వాన్ని చట్టబద్ధ బాధ్యతను హరించే విధంగా, ప్రజాస్వామ్యం పనిచేయలేనిరీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదన్నారు. ప్రభుత్వం ఎన్నికైన మరుసటిరోజు నుంచి మనకు నచ్చినట్టు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలనే దెబ్బతీస్తుందన్నారు. ఎంతో శక్తిమంతమైన వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటం కోసం గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళన పద్ధతుల్ని రూపొందించారని, ఆయన అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయని, అయితే స్వతంత్ర భారతంలో కూడా అవే ఆందోళనాపద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదని జేపీ అన్నారు. జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి – మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా గుర్తించలేకపోతున్నాయన్నారు. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅదుపూలేని చట్టధిక్కారాలు వల్ల తలెత్తే ప్రమాదాల గురించి అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారన్నారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుసంపన్నతకు అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే ఎప్పటికీ ఫలితాలు రావన్నారు. (అంబేద్కర్ ఆశించిన స్వతంత్ర భారత రాజకీయ సంస్కృతి సాధనకు జేపీ చూపిన నవ పరిష్కారాల వ్యాసాన్ని www.fdrindia.org వెబ్‌సైట్‌లో చదవవచ్చు)

ఆమోదించటం, కోరం, విప్, బ్యాలట్ ద్వారా ఓటు వేయటం, ఓట్ల లెక్కింపు, సెన్సర్ తీర్మానం, రెగ్యులరైజేషన్ మొదలైన ప్రక్రియలన్నింటికీ సంబంధించిన నిబంధనలు బౌద్ధసంఘాల్లో ఉండేవి. వీటిని బుద్ధుడు బౌద్ధసంఘాల్లో ప్రవేశపెట్టాడంటే..




అవి ఖచ్చితంగా ఆయన కాలంనాటి రాజకీయ శాసనసభల్లో అమలవుతూ ఉంటాయని, వాటిని ఆయన స్వీకరించి ఉంటాడని మనం భావించవచ్చు. ఇటువంటి ప్రజాస్వామిక వ్యవస్థను భారత్ కోల్పోయింది. రెండోసారి కూడా కోల్పోతుందా? నాకు తెలియదు. కానీ, చాలాకాలంగా ప్రజాస్వామ్యాన్ని ఆచరించని భారత్ వంటి దేశంలో ప్రజాస్వామ్యం నియంతృత్వానికి జన్మనిచ్చే ప్రమాదం మాత్రం ఉంది. కొత్తగా పుట్టిన ఈ ప్రజాస్వామిక వ్యవస్థ తన రూపాన్ని నిలబెట్టుకుంటూనే సారంలో మాత్రం నియంతృత్వానికి దారితీసే అవకాశం పుష్కలంగా ఉంది. ఎన్నికల్లో ఒక పార్టీకే బ్రహ్మాండమైన విజయం లభించినప్పుడు ఈ రెండోరకం ప్రమాదానికి అవకాశాలు మరింతగా పెరుగుతాయి.

**మూడు హెచ్చరికలు**

ప్రజాస్వామ్యాన్ని రూపంలో మాత్రమే కాదు సారంలో కూడా నిలబెట్టుకోవాలంటే మనం ఏం చేయాలి?

తొలిహెచ్చరిక : మన సామాజిక, ఆర్థిక లక్ష్యాల సాధనలో రాజ్యాంగబద్ధమయిన పద్ధతులకు తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి. అంటే దీనర్థం.. విప్లవం తాలూకు హింసాయుత పద్ధతులతోపాటు పౌర ఉల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి ప్రక్రియలను పూర్తిగా విడిచిపెట్టాలి. ఈ పద్ధతులు అరాచకవాదానికి పర్యాయపదాల్లాంటివి. వాటిని ఎంత త్వరగా త్యజిస్తే మనకంత మేలు జరుగుతుంది.

రెండోహెచ్చరిక: ప్రజాస్వామ్య మద్దతుదార్లను హెచ్చరిస్తూ జాన్‌స్టువర్ట్‌మిల్ ఇచ్చిన పిలుపును మనం ఖచ్చితంగా పాటించాలి. "ఎంత గొప్ప వ్యక్తి అయినాసరే ఆయన పాదాల వద్ద మీ స్వేచ్ఛను ధారపోయకండి. ఎంత గొప్ప వ్యక్తి అయినా సరే మీ వ్యవస్థలను కూలదోసే అధికారాలను అతడికి అందించకండి" అని మిల్ హెచ్చరించారు. దేశం కోసం జీవితాంతం సేవలందించిన గొప్పవ్యక్తుల పట్ల కృతజ్ఞతతో ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. కానీ, కృతజ్ఞతకు కూడా ఒక హద్దు ఉంటుంది. భారతదేశ రాజకీయాల్లో భక్తికి లేదా వ్యక్తి ఆరాధనకు ఉన్న ప్రాధాన్యం అంతాయింతా కాదు. మోక్షసాధన కోసం మతంలో భక్తి అవసరమేమోగానీ రాజకీయాల్లో భక్తి లేదా వ్యక్తి ఆరాధన అనేది పతనానికి, అంతిమంగా నిరంకుశత్వానికి దారితీస్తుంది.

మూడోహెచ్చరిక: రాజకీయ ప్రజాస్వామ్యానికే మనం పరిమితం కావొద్దు. మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా కూడా మలచుకోవాలి. సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకపోతే రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు.

**సామాజిక ప్రజాస్వామ్యం**

సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? సామాజిక ప్రజాస్వామ్యం అనేదొక జీవనవిధానం. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే మూడు అంశాలను జీవనానికి అవసరమైన సిద్ధాంతాలుగా ఇది పరిగణిస్తుంది. ఈ మూడూ ఒకదాంతో ఒకటి విడదీయరానివి. వీటిలో ఏ ఒక్కదానిని తొలగించినా ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుంది. సమానత్వం లేని స్వేచ్ఛ.. చాలామంది మీద కొందరి ఆధిపత్యాన్ని నెలకొల్పుతుంది. స్వేచ్ఛ లేని సమానత్వం వ్యక్తిగత చొరవను చంపేస్తుంది. సోదరభావం లేని స్వేచ్ఛ, సమానత్వం సహజంగా ఉండవు. వాటిని బలవంతంగా రుద్దాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

భారతీయ సమాజంలో సమానత్వం, సోదరభావం అనేవి లేనేలేవన్న విషయాన్ని ముందుగా మనం గుర్తించాలి. 'అంతస్తులవారీగా అసమానత్వం' అనే సిద్ధాంతం మీద రూపొందించిన సమాజం భారత్‌లో ఉంది. అనేకమంది అత్యంత పేదరికంలో ఉంటే, కొద్దిమంది మాత్రం సిరిసంపదల్లో తులతూగుతున్న వ్యవస్థ ఇది. 26 జనవరి 1950 నుంచి వైరుధ్యాలున్న జీవితంలోకి మనం అడుగుపెట్టబోతున్నాం. రాజకీయరంగంలో మన మధ్య సమానత్వం ఉంటుంది.

సామాజిక, ఆర్థిక రంగాల్లో మాత్రం అసమానత్వం కొనసాగుతుంది. అంటే, రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక్కటే విలువ అనే సూత్రాన్ని మనం పాటించబోతున్నాం. కానీ సామాజిక, ఆర్థిక జీవితాల్లో మాత్రం ఒక మనిషికి ఒక్కటే విలు అనే సూత్రాన్ని నిరాకరించనున్నాం. ఈ వైరుధ్యాల జీవితాన్ని మనం ఎన్నాళ్లు కొనసాగిస్తాం? సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని ఎంతకాలంపాటు నిరాకరిస్తాం? దీర్ఘకాలంపాటు ఇలాగే నిరాకరించుకుంటూ వెళ్తే, మన రాజకీయ ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదు. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తప్పనిసరిగా మనం తొలగించాలి. ఇది జరగకపోతే అసమానత్వం కారణంగా నష్టపోయేవాళ్లంతా కలిసి.. రాజ్యాంగసభ ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని బద్దలు కొడతారు. ఇక సోదరభావం (సౌభ్రాతృత్వం) గురించి చూద్దాం. భారతీయులందరూ ఒకటేనన్న భావనే సోదరభావం. మన సామాజిక జీవితంలో ఐక్యతను, సంఘీభావాన్ని నెలకొల్పేది ఈ భావనే. అయితే.. దీనిని సాధించటం అంత సులువు కాదు. మనందరిదీ ఒకేజాతి అని భావించటం ద్వారా ఒక పెద్దభ్రమను పెంపొందించు కుంటున్నామన్నది నా అభిప్రాయం. కొన్నివేల కులాల కింద చీలిపోయిన ప్రజలు ఒకేజాతిగా ఎలా ఉండగలరు? సామాజిక, మానసిక రంగాల్లో మనం ఇంకా ఒక జాతిగా రూపుదిద్దు కోలేదన్న సత్యాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే మనకు అంత మంచిది. దాని ద్వారా.. ఒక జాతిగా రూపొందాల్సిన అవసరాన్ని, ఆ లక్ష్యసాధనకు కావలసిన మార్గాలు, సాధనాల గురించి మనం తీవ్రంగా ఆలోచించగలుగుతాం. కులాలనేవి జాతి వ్యతిరేకమైనవి. అవి సామాజిక జీవితంలో విభజనను తీసుకురావటమేకాదు, కులానికి కులానికి మధ్య తీవ్రమైన అసూయను, విముఖతను పుట్టిస్తాయి. అందువల్లేకులాలు జాతి వ్యతిరేకమైనవి. ఒక జాతిగా ఆవిర్భవించాలంటే ఇలాంటి అడ్డంకులన్నింటినీ మనం అధిగమించాల్సి ఉంటుంది. ఒక జాతిగా ఉన్నప్పుడే సోదరభావం అనేది వాస్తవరూపంలో సాధ్యమవుతుంది. సోదరభావం లేకుండా సమానత్వం, స్వేచ్ఛ కేవలం పైపూతల్లా ఉంటాయేతప్ప లోతుగా, గాఢంగా ఉండవు.

మనముందున్న కర్తవ్యాల గురించి ఇవీ నా అభిప్రాయాలు. కొంతమందికి ఈ మాటలు నచ్చకపోవచ్చు. కానీ ఈ దేశంలో రాజకీయాధికారం ఎంతోకాలంగా అతికొద్దిమంది గుత్తాధిపత్యంగా ఉందని, ఆ అతికొద్దిమందిని అత్యధిక సంఖ్యాకులు నెత్తిన పెట్టుకొని భారం మోయటమేకాదు, బలి కూడా అవుతున్నారని చెప్పటం తప్పుకాదు. ఈ గుత్తాధిపత్యం అనేకమందికి తమ జీవితాల్ని మెరుగుపరుచుకునే అవకాశాన్ని నిరాకరించటమే కాదు.. జీవిత పరమార్థం నుంచే వారిని దూరం చేసింది. పాలితులుగా ఉండీఉండీ వీరు విసుగెత్తిపోయారు. తమనుతాము పాలించుకోవడం కోసం ఆతృతతో ఉన్నారు. తీవ్రమైన అణచివేతకు గురయిన ప్రజల్లోని ఈ స్వీయచైతన్యం వర్గపోరుకు దారితీయకుండా చూడాలి. లేదంటే, చట్టసభ నిట్టనిలువునా చీలిపోతుంది. దానివల్ల జరిగేది వినాశనమే. అబ్రహాం లింకన్ చెప్పినట్లుగా, చీలిపోయి తనకు వ్యతిరేకంగా తానే నిలబడిన సభ ఎంతోకాలం ఉనికిలో ఉండలేదు. కాబట్టి, అణచివేతకు గురయిన అత్యధిక ప్రజల ఆకాంక్షలను సాకారం చేయటానికి ఎంతత్వరగా అవకాశం కల్పిస్తే.. ఆ అతికొద్దిమందికి అంత మంచిది. దేశానికి అంతమంచిది. స్వాతంత్ర్యం కొనసాగింపునకు అంతమంచిది. దేశంలోని ప్రజాస్వామ్యానికి అంత మంచిది. జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలో సమానత్వాన్ని, సోదరభావాన్ని నెలకొల్పటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందువల్లే దీనికి నేను అంతగా ప్రాధాన్యమిచ్చాను.

స్వాతంత్ర్యం అనేది సంబరాలు జరుపుకోవాల్సిన సందర్భమే. దాంట్లో ఎలాంటి సందేహం లేదు.క ఆనీ, ఈ స్వాతంత్ర్యం మనమీద పెద్ద బాధ్యతలను పెట్టిందనే విషయాన్ని మర్చిపోవద్దు. ఏ తప్పు జరిగినా బ్రిటీషువాళ్లని విమర్శించే అవకాశం ఇకమీదట మనకు ఉండదు. ఇకపై జరిగే తప్పులకు మనల్ని మనమే నిందించుకోవాల్సి ఉంటుంది. తప్పులు జరిగే అవకాశాలు అనేకం ఉన్నాయి. కాలం వేగంగా మారుతోంది. మన ప్రజలు కొత్త సిద్ధాంతాలతో చైతన్యవంతులవుతున్నారు. తమ పేరిట నడిచే ప్రభుత్వాలను కాదు.. తమకోసం పనిచేసే ప్రభుత్వాలను వారు కోరుకుంటున్నారు. 'ప్రజల యొక్క, ప్రజల కొరకు, ప్రజల చేత నడిచే ప్రభుత్వం' అనే సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించదలచిన మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే, మన ముందుదారిలో ఉన్న దుష్టశక్తులను ఎలాంటి జాప్యం లేకుండా గుర్తించాలి. వీటిని తొలగించటంలో మనం ఎంతమాత్రం రాజీపడకూడదు. నాకు తెలిసినంతవరకూ దేశానికి సేవ చేయటానికి ఇంతకన్నా మెరుగైన మార్గం మరొకటి లేదు.

**(భారత రాజ్యాంగాన్ని ఆమోదించటానికి ఒకరోజు ముందు నవంబర్ 25, 1949న రాజ్యాంగసభనుద్దేశించి అంబేద్కర్ చేసిన ప్రసంగంలోని ఈ ముఖ్యాంశాలు.. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా. కర్టెసీ: ఈనాడు)** ★

# అప్పుల ముప్పులో ఆంధ్ర

- కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి

"ఆంధ్రప్రదేశ్ ఖజానా తెరిస్తే అందులో ఏమీ లేవు అప్పుల కాగితాలు తప్ప".. ఈ మాటలన్నది స్వయానా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు. తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందంటూనే మరోవైపు వందల కోట్లు ప్రజాధనాన్ని సర్కారు ఎలా దుబారా చేయగలుగుతోందో ఆర్థికమంత్రిగారికే తెలియాలి. నిజానికి ఆంధ్రప్రదేశ్ అప్పుల ముప్పులో ఉందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఈ మధ్యనే తన నివేదికలో హెచ్చరించింది. రాష్ట్రంలో అప్పులు-ఆదాయం మధ్య సమతౌల్యం తప్పుతోందని వచ్చే ఏడేళ్లలో చెల్లించాల్సిన అప్పులు రూ.55,618కోట్ల మేర ఉంటాయని అంచనా వేసింది. ఇది మరిన్ని అప్పులకు దారి తీసి బడ్జెట్‌లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కాగ్ స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్రం ద్రవ్యబాధ్యత-బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనలను దాటి అప్పులకు వెళ్లినట్టు గుర్తుచేసింది. ఇవన్నీ పెడచెవిన పెడుతున్న ప్రభుత్వం తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం తొలి ఆరునెలల్లోనే దాదాపు 7.4శాతం వడ్డీతో రూ.8,500కోట్లు బాండ్ల విక్రయం ద్వారా అప్పు తెచ్చింది. మరోవైపు రాజధానిలోని పలు ప్రాజెక్టులతోపాటు ఇతర రంగాలకు చెందిన ప్రాజెక్టుల నిమిత్తం భారీస్థాయిలో విదేశీ అప్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రూ.31,113కోట్ల రుణం కోసం కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు పంపింది. అంతేకాదు ఇంకా అనేక అప్పులు చేయడానికి తమ రాష్ట్రానికున్న ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వెసులుబాటు కల్పించాలని కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వం కోరడం గమనార్హం.

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రవేశపెట్టిన నవ్యాంధ్రప్రదేశ్ తొలి బడ్జెట్ ప్రకారమే రాష్ట్రం మొత్తం అప్పులు రూ.1,46,852 కోట్లు. ఇది రాష్ట్ర జనాభా కన్నా 30వేల రెట్లు ఎక్కువ. అంటే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ 30వేల రూపాయల అప్పుల భారాన్ని మోయాల్సి వుంటుంది. ఇప్పుడు ఈ భారం మరీ పెరగనుంది. 2016 మార్చి 31నాటికి ఏపీ ప్రభుత్వం తన బడ్జెట్‌లో పొందుపరిచిన లెక్కల ప్రకారం పేరుకుపోయిన అప్పు రూ.1,70,822కోట్లు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఏపీ ప్రభుత్వం రూ.12,258కోట్లు కేవలం వడ్డీగా చెల్లించాల్సి ఉంది. మరొక ఆశ్చర్యకరమైన విషయమేమంటే, శాసనసభ ఆమోదం లేకుండానే ఈ ఏడాది రూ.13,134.68కోట్ల మేర అదనంగా ప్రభుత్వం ఖర్చు చేయడం. అంతేకాదు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొన్ని రుణాలను బడ్జెట్‌లో చూపటం లేదు. ఇది మరీ విచిత్రం. ఆర్థిక సంవత్సరం చివరి రోజున రూ.16,379కోట్లకు పున:కేటాయింపులు (రీఅప్రాప్రియేషన్) ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఏడాది మొత్తం వ్యయంలో ఇది 11.63శాతానికి సమానం. బడ్జెట్ వ్యయం సంవత్సరమంతా సమానంగా ఉండాలి తప్పితే చివరి నిముషంలో హడావుడి నిర్ణయం తీసుకోకూడదనే విషయం విస్మరించి చివరి త్రైమాసికంలో 34శాతం చేశారు. అందులోనూ ఒక్క మార్చిలోనే 24శాతం ఖర్చు చేశారు. ఇక 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక కింద ఎస్సీలకు 17.10శాతం, ఎస్టీలకు 5.33శాతం నిధులు కేటాయించాల్సి వుంటే, 16శాతం, 5.2 రెండు శాతం కేటాయించారు. ఎస్సీ నిధులు 31శాతం, ఎస్టీ నిధులు 60శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఎస్సీ నిధుల్లో రూ.1,418.59కోట్లు, ఎస్టీ నిధుల్లో రూ.582.76 కోట్లు



**ప్రత్యేక హోదాతో కాకుండా ప్రత్యేక ప్యాకేజీతో ఏ విధంగా ఉద్యోగాలు కల్పిస్తారో, ఆర్థికాభివృద్ధి సాధిస్తారో ప్రభుత్వానికే తెలియాలి. రాష్ట్ర ప్రభుత్వం తన విజన్ మార్చుకోవాలి. తుఫాన్ల కంటే విపరీతంగా పెరుగుతున్న నిరుద్యోగం, ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్న అప్పులే భవిష్యత్‌లో అతి పెద్ద ప్రమాదాలు.**




పునఃకేటాయింపులు చేశారు. ఇది పథకం అమలులోని అసమర్థతను సూచిస్తుంది. ఎస్సీ నిధుల్లో రూ. 402కోట్లు, ఎస్టీ నిధుల్లో రూ. 177కోట్లు మిగులును సరెండర్ చేశారు. ఇక 2004లో ప్రారంభించిన ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాలేదని, పైగా అంచనాలు విపరీతంగా పెంచారని కాగ్ తప్పు పట్టింది. రాష్ట్రంలోని 47 ప్రాజెక్టులను 2004లో రూ. 48,034.62కోట్ల అంచనాలతో చేపట్టారు. అందులో 50శాతం మేరకు అంటే రూ. 23,626.65 కోట్లు అదనంగా అంచనాలు పెంచేసి మొత్తం ప్రాజెక్టు విలువను రూ. 71,661.27కోట్లకు చేర్చారు. ఈ మొత్తంలో రూ. 29,612.31కోట్లను ఖర్చు చేసి ప్రాజెక్టులను అసంపూర్తిగానే ఉంచారు. ప్రాజెక్టులు ఆలస్యమయ్యేకొద్దీ వాటి అంచనాలు పెరుగుతున్నాయని, దీనివల్ల రాష్ట్రం ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదని, కేవలం గుత్తేదారులకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని కాగ్ తప్పుపట్టింది.

వాస్తవానికి రెవెన్యూ రాబడులు సరిపోని పరిస్థితుల్లో ఒకస్థాయి వరకు అప్పులు చేయడం సమంజసమే. అందులోనూ రాజధాని కూడా లేని ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అప్పులు చేయకతప్పదు. కానీ అవసరం అనే నెపంతో అడ్డూఅదుపూ లేకుండా ఇలా అప్పులు చేసుకుంటూ పోతే భవిష్యత్తులో అనేక అనర్థాలు కలుగకమానవు. చేస్తున్న అప్పులు రాష్ట్రంలో ఉత్పాదక ఆస్తులు పెంచుకోవడానికి, ఉద్యోగాలు సృష్టించుకోవడానికి ఉపయోగపడాలి. కానీ మన ప్రభుత్వం చేస్తున్న అప్పులు కేవలం వడ్డీలు కట్టడానికి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికే సరిపోతున్నాయి. ఇదే ఆందోళనకరమైన విషయం. ఒకపక్క ప్రభుత్వం రెండంకెల వృద్ధి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నా, కచ్చితంగా రెవెన్యూ లోటు ఎంతో చెప్పలేని పరిస్థితిలో ఉంది. ఆర్భాటాలకు పోయి కోట్లాది రూపాయలు దుబారాగా ఖర్చు చేయడం, సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు నిధులు మళ్లించడం, సకాలంలో ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడంతో పెరిగిన అంచనాలు, ముందస్తు ప్రణాళిక లేకుండా చేస్తున్న ఖర్చులే నేటి దుస్థితికి ప్రధాన కారణం. దీని వెనక కొందరి ప్రయోజనాలున్నాయన్న విమర్శలూ వినవస్తున్నాయి. రాయితీలతో కూడిన ప్రత్యేక తరగతి హోదా కల్పించి ఉపశమనం కలిగిస్తామని హామీ ఇచ్చిన ఎన్డీయే ప్రభుత్వం రెండున్నరేళ్ల దాగుడుమూతల అనంతరం హోదా సాధ్యం కాదని, హోదాకూ పారిశ్రామిక రాయితీలకూ సంబంధమే లేదని, అందుకే అంతకు మించిన భారీ ప్యాకేజీని ఏపీకి కేంద్రం ఇస్తోందని ప్రకటించింది. దీన్ని ఏపీ ప్రభుత్వం కూడా స్వాగతించింది. ప్రత్యేక తరగతి హోదా కాకుండా ప్రత్యేక ప్యాకేజీతో ఏ విధంగా ఉద్యోగాలు కల్పిస్తారో, ఎలా ఆర్థికాభివృద్ధి సాధిస్తారో ప్రభుత్వానికే తెలియాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కోవాలి. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన విజన్, వ్యవహారశైలి మార్చుకోవాలి. ప్రభుత్వాన్ని దాపరికం లేకుండా, ప్రజల భాగస్వామ్యం ఉండేలా నడపాలి. పరిపాలన ధర్మబద్ధంగా ఉండాలంటే, రహస్యం అనే చీకటి తొలగిపోవాలి. భవిష్యత్తులో తుఫాన్లు, భూకంపాల ప్రమాదం కంటే ఆంధ్రప్రదేశ్‌కి విపరీతంగా పెరుగుతున్న నిరుద్యోగం, ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్న అప్పులే అతిపెద్ద ప్రమాదాలని గ్రహించాలి. ఈ ప్రమాదాలను అధిగమించిననాడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందనడంలో సందేహం లేదు. ★

## వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలి



వెనకబడిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలిసారి విశాఖకు వచ్చిన బాబ్జీని అభినందిస్తూ పార్టీ నేతలు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, జిల్లాలకు ప్రత్యేక హోదాపై, స్థానిక ప్రజాసమస్యలపై ఉద్యమాలకు లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఈ ఏడు జిల్లాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అమరావతి తప్ప మరేమీ కనిపించటం లేదని అన్నారు. మీటింగ్‌లకు విశాఖపట్నం, వ్యవహారాలకు అమరావతి అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి, హరిగణేష్, సాంబశివరావు, పక్కి శంకర్, కిరణ్, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తపాతం లేకుండా దేశాన్ని ఏకం చేసిన పటేల్



అక్కడక్కడా మినహాయించి రక్తపాతం లేకుండా దేశాన్ని ఏకం చేసిన గొప్ప నేత వల్లభాయ్ పటేల్ అని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండు రంగారావు అన్నారు. ప్రపంచంలోనే ఇలాంటి ఉదాహరణ కనిపించదన్నారు. పటేల్ జన్మదినోత్సవాన్ని హైదరాబాద్ పార్టీ కార్యా లయంలో నిర్వహించారు. దేశసమగ్రత కోసం, విలువల కోసం ముందు చూపుతో, ధైర్యంగా నిలబడిన పటేల్ లాంటి నేతల వల్ల మన ప్రజాస్వామిక ప్రతిష్ట పెరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేతలు జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారావు, సరోజాదేవి, రాజీవ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోండి



బాణసంచా అక్రమ నిల్వలకు చిలకలూరిపేట అడ్డాగా మారిందని, దీపావళితో ప్రమేయం లేకుండా వివిధ వేడుకలకు ఇక్కడ్నుంచే అక్రమ రవాణా చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. కోట్ల రూపాయల ఈ అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకుని ప్రజలకు భద్రత కల్పించాలని తహసీల్దార్ పీసీహెచ్ వెంకటయ్యను కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మురికిపూడి ప్రసాద్, కె.బంగారుబాబు, సీహెచ్ శ్రీనివాసరావు, సాతులూరి శాంతారావు, షేక్ సాదిక్, షేక్ బాబు, జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ★

# ఆంధ్రప్రదేశ్‌లో ఈ-ఆఫీసు

ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా సేవలు అందించేందుకు 'పౌరసేవల చట్టం' తీసుకురావటానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేయగా, ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా ముందుకు రావటం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవను అభినందిస్తూ ఇప్పటికే లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ రూపొందించిన పౌరసేవల నమూనా చట్టాన్ని జేపీ పంపించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమల్లోకి తెస్తుందని ఆశిస్తున్నామని, ఇందుకోసం అవసరమైతే తమవంతు సూచనలివ్వడానికి ప్రభుత్వం కోరితే సిద్ధమని కూడా ముఖ్యమంత్రికి తెలియచేశారు. కానీ ఏపీ నుంచి నిజమైన పాలనా సంస్కరణల కోసం ప్రయత్నం ఇంకా కనిపించటం లేదు. పాలనలో ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు టెక్నాలజీ అవసరమేగానీ అది సరిపోవటం లేదని అనుభవాలు చెబుతున్నా ఇంకా టెక్నాలజీ, సీనియర్ ఐఏఎస్ అధికారుల చుట్టూనే పరిష్కారాల్ని ఏపీ ప్రభుత్వం తిప్పుతోంది. లోక్‌సత్తా 1998లో పౌరసేవల పత్రాన్ని దేశంలోనే మొదటిసారిగా 'స్వరాజ్యం' పుస్తకరూపంలో వెలువరించినప్పుడు అభినందించి అమలుచేస్తామని హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ఇప్పుడు ఇరవై ఏళ్ల క్రితం నాటి పాలనా సంస్కరణల స్థాయిలో కూడా ఆలోచించలేకపోతున్నారు. తాజాగా ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు డిసెంబర్ 1 నుంచి ఏపీ ప్రభుత్వం అన్ని జిల్లా కార్యాలయాల్లో ఈ-కార్యాలయం (ఆఫీసు) వ్యవస్థను ప్రారంభిస్తోంది. జన్మభూమి, మీకోసం కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి, జిల్లా డివిజన్ స్థాయిల్లో అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు, ముఖ్యమంత్రి హామీల అమలుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెబుతోంది. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'సింగిల్ ఫైల్ ఈ-ఆఫీసు' విధానానికి అందరూ సంసిద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా అవసరంలేని ఫైల్స్‌ని తొలగించి మిగిలినవాటిని స్కాన్ చేసి ఈ-ఫైల్ రూపంలోకి తీసుకొస్తారు.




"వెంటపడి పనులు చేయించుకునేవారి ఫైల్స్‌నే పరిష్కరిస్తున్నారు తప్ప పేదలు, అణగారినవర్గాల దరఖాస్తులను పట్టించుకోవటం లేదు. ఈ-ఆఫీసు వల్ల ఏ ఫైల్ ఎక్కడుందో తెలుస్తూ జాప్యానికి అవకాశాలు తగ్గించగలుగుతాం" అని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. జిల్లా స్థాయిలో ఈ-కార్యాలయం పనులు మొదలుకుని సంబంధిత అన్ని అంశాలను పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించారు. మరోవైపు పాలనను వికేంద్రీకరించేందుకు మధ్యస్థాయిలో అధికార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా రెవెన్యూ డివిజన్ల పరిధుల హేతుబద్ధీకరణ, డివిజన్ల పునర్‌వ్యవస్థీకరణ చేస్తారు. అన్ని స్థాయిల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్లకు ఆదేశాలను జారీచేశారు. ఎన్నికైన ప్రభుత్వానికి సొంత శైలిలో వ్యవహరించే హక్కుంటుందిగానీ, వీటితో సంబంధం లేకుండా.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పౌరసేవల చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. ★

# జిందాల్ భూములను రైతులకు అప్పగించండి




విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో జిందాల్ అల్యూమినా కర్మాగారం ఏర్పాటుకు సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఎస్.కోట పార్టీ సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ, జిందాల్ కర్మాగారానికి సేకరించిన 1048 ఎకరాల భూములను 15రోజుల్లోగా రైతులకు అప్పగించాలన్నారు. లేకపోతే లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు జిందాల్ ప్రభావిత గ్రామాలలో పర్యటించి రైతులను చైతన్యం చేసి దగ్గరుండి వారితో సాగు చేయిస్తామన్నారు. జిందాల్ భూముల పరిహారం చెల్లింపులో అక్రమాలను లోక్‌సత్తాయే బైటపెట్టిందని, అక్రమాలపై అప్పట్లో పెద్దఎత్తున పోరాటం చేసిన అప్పటి ప్రతిపక్షం, ప్రస్తుత అధికార పక్షం తెలుగుదేశం ఇప్పుడు కనీసం స్పందించటం లేదని అన్నారు. కేంద్ర మంత్రి అశోకగజపతి రాజు అప్పట్లో బొడ్డవర వచ్చి మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే పార్టీ వైఖరి మారిందా? అని ప్రశ్నించారు. జిందాల్ అక్రమాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2008 సెప్టెంబర్ 8న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని, ఆ తర్వాత పార్టీ నాయకులు సేకరించిన ఆధారాల నివేదికతో ప్రభుత్వానికి, ఏసీబీకి, లోకాయుక్తకు లేఖ రాశారని వివరించారు. బొడ్డవర, కిల్లంపాలెం, ముషిడిపల్లి పంచాయతీల పరిధిలో సేకరించిన 1048.48 ఎకరాలకు రూ. 22.44కోట్లు పరిహారం చెల్లించారని, ఇందులో రూ. 10కోట్లు వరకు నిధుల్ని అధికారులు, రాజకీయ నాయకులు దిగమింగారని, 13మంది బినామీ రైతులకు రూ. 35.10 లక్షలు పరిహారం చెల్లించారనే వివరాలను లేఖలో తెలిపారన్నారు. 2015లో ప్రభుత్వానికి ఏసీబీ ఇచ్చిన నివేదికలో లోక్‌సత్తా పార్టీ ఇచ్చిన వివరాలు వాస్తవమేనని ధృవీకరించిందన్నారు. ఆ తర్వాత లోక్‌సత్తా బైటపెట్టిన అక్రమాలు అవినీతి వాస్తవమని లోకాయుక్త తీర్పునిచ్చిందన్నారు. కానీ దోషులపై చర్యలులేవన్నారు. తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని.. కానీ జిందాల్ ఫ్యాక్టరీ రాకపోయినా, అక్రమార్కులపై చర్యలు లేకపోయినా, భూములిచ్చిన రైతులు రోడ్డున పడ్డా ప్రభుత్వానికి పట్టటం లేదని, వెంటనే తగిన చర్యలు తీసుకుని రైతులకు భూములను తిరిగి ఇవ్వాలని 2015 సెప్టెంబర్ 15న జేపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాశారన్నారు. ఏడాది గడచినా అవినీతిపరులపై చర్యలకు, రైతులను కాపాడేందుకు ముఖ్యమంత్రికి తీరికలేదని, ఆయన అమరావతికే పరిమితమయ్యారని అన్నారు. కేంద్ర మంత్రి అశోకగజపతిరాజు, జిల్లా నేతలు, అధికారులు స్పందించి రైతులకు భూములను తిరిగి ఇప్పించాలని బాబ్జీ డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ మండల కన్వీనర్ కాండ్రేగుల ప్రసాద్, ఎ.పద్మాకర్, కె.రామలక్ష్మి, దాసుమాస్టారు తదితరులు పాల్గొన్నారు. ★

# చంద్రబాబుకు ఆదరణ తగ్గుతోంది...
# ప్రజాసమస్యలపై లోక్‌సత్తా శంఖారావం

రాష్ట్ర విభజనను ఒక అవకాశంగా మలచుకోవటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలమయ్యారని, పాలన కనీస స్థాయిలో కూడా లేకపోవటం వల్లే ఆయనకు రోజురోజుకూ ప్రజాదరణ తగ్గుతోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రత్యేక హోదాతో వచ్చే పారిశ్రామిక పన్ను రాయితీల్ని కేంద్రం నుంచి కలిసికట్టుగా సాధిద్దామని, అభివృద్ధి-పాలనను కేంద్రీకరించవద్దని, అవినీతి నిరోధానికి పౌరసేవల చట్టం సహా ఏర్పాట్లు చేయాలని, విద్య, వైద్యరంగాలను ప్రక్షాళన చేయాలని, కుల రాజకీయాలు వద్దని లోక్‌సత్తా పలుమార్లు చెప్పినా పెడచెవినబెట్టి అందుకు విరుద్ధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా మీద మాట్లాడలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు.

లోక్‌సత్తా పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశం విజయవాడలో జరిగింది. సమావేశం నిర్ణయాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, ఇతర నేతలతో కలిసి బాబ్జీ మీడియాకు వివరించారు.

సుదీర్ఘ సమీక్షలు, ప్రసంగాలు, టెలికాన్ఫరెన్స్‌లు తప్ప ప్రజలకు ప్రయోజనం కలిగించే పాలన రాష్ట్రంలో జరగడం లేదని, ప్రజలకు మేలు చేసే సలహాలను వినే స్థితిలో ముఖ్యమంత్రి లేరని, ఈ నేపథ్యంలో పరిష్కారాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ పోరాటాలకు లోక్‌సత్తా పార్టీ శ్రీకారం చుడుతోందని బాబ్జీ తెలిపారు. రెవెన్యూ శాఖలో అవినీతి పెచ్చుమీరిందని, మ్యుటేషన్ లాంటి చిన్న సమస్యలకు ప్రజలు మీసేవ కార్యాలయాల చుట్టూ లంచాలతో ప్రదక్షిణాలు చేయాల్సి వస్తోందన్నారు. రైతులు వేల రూపాయల ముడుపులిస్తేనే పట్టా పనులు చేసిపెడుతున్నారని అన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రతి లోక్‌సత్తా ఆధ్వర్యంలో కలెక్టర్, మండల కార్యాలయాల వద్ద సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక తరగతి హోదా, విద్య, ఆరోగ్యం, పౌరసేవల చట్టం అంశాలతోపాటు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**ప్రత్యేక హోదాతో వచ్చే పారిశ్రామిక పన్ను రాయితీల్ని కేంద్రం నుంచి కలిసికట్టుగా సాధిద్దామని, అభివృద్ధిని-పాలనను కేంద్రీకరించవద్దని, అవినీతి నిరోధానికి పౌరసేవల చట్టం సహా ఏర్పాట్లు చేయాలని, విద్య, వైద్యరంగాలను ప్రక్షాళన చేయాలని, కుల రాజకీయాలు వద్దని లోక్‌సత్తా పలుమార్లు చెప్పినా పెడచెవినబెట్టి అందుకు విరుద్ధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు.**

### పవన్ కళ్యాణ్‌సభలకు మద్దతిస్తున్నాం.. కానీ ఆయన విధానాల్లో స్పష్టత కావాలి

ప్రత్యేక హోదా, ఇసుక మాఫియా, అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్, పొరుగు సేవల ఉద్యోగులు తదితర సమస్యలపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గొంతు విప్పాలన్నారు. హోదాపై పవన్ సభలకు లోక్‌సత్తా మద్దతిస్తుందని, అయితే పరిష్కారాలపై ఇంకా స్పష్టతతో వ్యవహరించాలని బాబ్జీ కోరారు. సమావేశంలో జి. అశోక్‌కుమార్, రాంబాబు, ఎంఎస్ఎన్ మూర్తి, ఎ.దామోదర్, రాజ్‌వర్మ, చందు అశోక్, కె. శ్రీనివాస్, భానుచందర్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతోపాటు ప్రయివేటు ఉపాధికి పెద్దఎత్తున చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న వారికి మార్చిన సిలబస్ మోడల్ పేపర్లను అందుబాటులోకి తేవాలని బాబ్జీ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, ప్రభుత్వోద్యోగాల భర్తీని వెంటనే పూర్తిచేసి ప్రయివేటు రంగంలో, పరిశ్రమల్లో పెద్దఎత్తున ఉపాధికి చర్యలు చేపట్టాలన్నారు. విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సమావేశంలో పార్టీనేతలు చోడి ఆదినారాయణ, మొల్లేటి చిన్నారావు, ఎ.నాగభూషణరావు, తిప్పాన కోటేశ్వరరావు, బి.రాజారావు తదితరులు పాల్గొన్నారు. ★

# రాజకీయ కబంధ హస్తాల నుంచి విశాఖ గ్రంథాలయాన్ని కాపాడేందుకు లోక్‌సత్తా మరో ఉద్యమం



తన పాత కేసులు ఏళ్ల తరబడి నడిచి, ఆ తర్వాత ఆ కేసుకు సంబంధించిన శాఖకు తానే మంత్రి అయితే ఎలా వుంటుంది? పాత కేసులు పరిష్కరించుకునే శాఖను దక్కించుకునే అవకాశం, అదృష్టం ఎంతమందికి వస్తుంది? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. మంత్రి పదవి వచ్చే వరకు ప్రత్యూష అసోసియేట్స్ షిప్పింగ్ కంపెనీలో గంటా భాగస్వామి. పదవి వచ్చిన తర్వాత రాజీనామా చేశారు. అంటే 2010లో విశాఖ జగదాంబ జంక్షన్ వద్దనున్న జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఒకటిన్నర ఎకరాల స్థలంలో 100కోట్ల విలువైన సంస్థను, డెవలప్ చేసే పనిని ప్రత్యూష కంపెనీ చేజిక్కించుకుంది. నిబంధనల ప్రకారం బీవోటీ పద్ధతిలో కమర్షియల్ కాంప్లెక్స్, గ్రంథాలయ సంస్థ కార్యాలయాన్ని 36 నెలల్లో నిర్మించి తీరాలి. ఆ నిబంధనను అందులోనే స్పష్టంగా పేర్కొన్నారు. కంపెనీ నిర్మించే కమర్షియల్ కాంప్లెక్స్‌లో మొదటి ఫ్లోర్ లైబ్రరీకయితే, మిగిలిన అన్ని ఫ్లోర్ల నుంచి వచ్చే ఆదాయమంతా మంత్రిగారి కంపెనీకే చెందుతుంది. బీవోటీలో ఆ నిబంధన పెట్టారు.

నిజానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే బీవోటీ పద్ధతి పాటిస్తుంటుంది. కానీ విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు పుష్కలంగా నిధులు ఉండటంతోపాటు తానే సొంతంగా భవనం నిర్మించుకునే ఆర్థిక స్తోమతు కూడా ఉంది. కానీ రాజకీయ ఒత్తిళ్లతో ఆ విధానంలో గంటా కంపెనీకి కేటాయించారు. గంటా గారి నాటి కంపెనీ గడువులోగా పని పూర్తి చేయలేదు. దానితో నిబంధనలో పేర్కొన్న ప్రకారం, సర్కారు ఆ కంపెనీ కాంట్రాక్టు రద్దు చేసింది. అంతకుముందే దీనిపై లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడు (అప్పట్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి) భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో నాడు భారీ ఉద్యమం నిర్వహించారు. ఇప్పుడు కూడా ఆయన ఆధ్వర్యాన ఆందోళనలు కొనసాగుతున్నాయి. నిజానికి అప్పటికి జిల్లా గ్రంథాలయ సంస్థకు 22 కోట్ల నగదుతోపాటు విశాఖ కార్పొరేషన్ నుంచి సెస్ కింద మరో 10కోట్లు రావలసి ఉంది. అందువల్ల స్థలాన్ని బీవోటీ కింద ఇవ్వాల్సిన పనిలేదని, బీవోటీ ఒప్పందాన్ని రద్దు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో పట్టుబట్టారు. దానికి స్పందించిన నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఒప్పందాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, ప్రస్తుత మంత్రి, గంటాతో వైరం ఉన్న అయ్యన్న పాత్రుడు కూడా ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ భూమిని బీవోటీ కింద ఇవ్వాల్సిన అవసరం ఏమిటని మీడియా సమక్షంలోనే ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ స్థలంలో ప్రభుత్వం ఫెన్సింగ్ వేసి మిలిటరీ రెజిమెంట్ వాహనాలకు కేటాయించింది.

ప్రభుత్వ నిర్ణయం వల్ల తనకు 3కోట్లు నష్టం వాటిల్లినందువల్ల గ్రంథాలయ సంస్థ నుంచి తనకు ఆ మొత్తాన్ని తనకు ఇప్పించవలసిందిగా మంత్రిగారి కంపెనీ కోర్టుకు వెళ్లింది. ఆ కేసు ఇంకా నడుస్తోంది. అయితే, గంటా ఇప్పుడు ఆ శాఖకే మంత్రి అయినందున మళ్లీ లీజు వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఇందుకోసం వేసిన కమిటీలో ఐదుగురు







అధికారుల్లో ముగ్గురు గంటా శాఖకు చెందినవారే కావటం విమర్శలకు తావిస్తోంది. కమిటీలో వున్న డైరెక్టర్ లైబ్రరీస్ ఫైనాన్స్ ఆఫీసర్, ఎస్ఎస్ఎ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, డీఎస్ఈ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డెప్యూటీ సెక్రటరీ స్కూల్స్ ఆయన శాఖ అధికారులే.

వడ్డీతో కలిపి 8కోట్ల పరిహారం కావాలంటున్న మంత్రిగారి కంపెనీపై ప్రజాసంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అసలు ఏం పనిచేశారని అన్ని కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని ప్రశ్నిస్తున్నాయి.

**అప్పుడు గంటా ఎమ్మెల్యేనే: బాబ్జీ**

గ్రంథాలయ సంస్థను బీవోటీ కింద తీసుకునే సమయంలో జరిగిన ఒప్పందాలపై నాటి ఎమ్మెల్యే గంటా సంతకం ఉందని, ఆ డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని బాబ్జీ తెలిపారు. ఈ తర్వాతే ఆయన రాజీనామా చేశారని చెబుతున్నారన్నారు. తాము దీనిపై లోకాయుక్త వరకు వెళ్లామని, ఒప్పందాన్ని రద్దు చేసినట్టు స్వయంగా ప్రభుత్వమే లోకాయుక్తకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు వేసిన కమిటీలో సభ్యులకు గంటాకు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చే ధైర్యం ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రజాసంఘాలు కోర్టుకు వెళతాయనే భయంతో వెంటనే నివేదిక ఇవ్వాలంటున్నారని ధ్వజమెత్తారు. లీజును రద్దు చేసి వెంటనే స్థలాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పచెప్పి అభివృద్ధి చేయించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ విశాఖపట్నం విభాగం ఇప్పటికే ఆందోళనలు చేపట్టిందని, ముఖ్యమంత్రికి లేఖ రాసి, సరైన స్పందన రాకపోతే మళ్లీ ఉధృతంగా ఉద్యమిస్తామని బాబ్జీ హెచ్చరించారు. ★

# రాయలసీమలో పీఏసీ 'గ్రామీణ గ్రంథాలయ ప్రాజెక్టు'

## లైబ్రరీలు విద్యలో భాగం: కమలకూరు స్కూలు గ్రంథాలయ ప్రారంభోత్సవంలో జేపీ



ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడానికి, ఆదాయాలు పెంచుకోవడానికి, దేశాన్ని అగ్రస్థాయికి తీసుకెళ్లడానికి 'నాణ్యమైన విద్య' ఒక్కటే మార్గమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా అట్లూరు మండల పరిధిలోని కమలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'పీపుల్ అగనెస్ట్ కరప్షన్' (పీఏసీ) సంస్థ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని వలంటీర్లతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాల్ని విద్యలో భాగంగా చూడాలని జేపీ ఈ సందర్భంగా అన్నారు. రాయలసీమలో 'గ్రామీణ గ్రంథాలయాల ప్రాజెక్టు'ను చేపట్టిన పీఏసీ సంస్థను అభినందించారు. ప్రతి విద్యాసంస్థలో పాఠ్యేతర పుస్తకాల పట్ల అభిరుచిని పెంచేలా గ్రంథాలయ ఏర్పాటు ఉండాలన్నారు. అధ్యయనంతో ఆలోచనలను, కార్యాచరణను పెంచుకోగలమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యావకాశాలను, ప్రమాణాలను పెంచాలని, గ్రామీణ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా సాగాలని జేపీ సూచించారు.

# ప్రజ్ఞ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

కడప జిల్లా బద్వేలులో పీపుల్ అగనెస్ట్ కరప్షన్ ఆధ్వర్యంలోని ప్రజ్ఞ సంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు జేపీ బహుమతులు ప్రదానం చేశారు. రాచాయపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి సుబ్బరాయుడు, ఈ.రామాపురం విద్యార్థి రాజశేఖర్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలవగా, బద్వేలు, అట్లూరు, కమలకూరు, కాలువపల్లె స్కూళ్ల విద్యార్థులు బహుమతులను గెలుచుకున్నారు. తెలుగుదేశం నాయకుడు గోపవరం ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, సునీల్ కుమార్, కృష్ణారెడ్డి, గజేంద్రనాథ్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కార్పొరేట్ ఆసుపత్రులనూ సందర్శిస్తున్న లోక్‌సత్తా నేతలు



వైద్యరంగం స్థితిగతులను అధ్యయనం చేసే క్రమంలో తెలంగాణలోని అన్ని ప్రభుత్వాసుపత్రులనూ సందర్శించిన లోక్‌సత్తా రాష్ట్ర కమిటీ తాజాగా ప్రధాన ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులనూ సందర్శిస్తోంది. అక్కడి వైద్యసేవలు, రుసుములు, ప్రజలకు అవుతున్న ఖర్చు, మందులు, మెరుగైన సేవలకు వైద్యులు చూపించే ప్రత్యామ్నాయాలు వంటి అంశాలను పార్టీ నేతలు తెలుసుకుంటున్నారు. తాజాగా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు నేతృత్వంలోని బృందం సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రిని సందర్శించింది. ప్రజలకు రూపాయి కూడా సొంత ఖర్చు లేకుండా ఆరోగ్యం అందేరీతిలో కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సత్తా సమర్పించిన 'అందరికీ ఆరోగ్యం' నమూనాలో ప్రయివేటు ఆసుపత్రుల భాగస్వామ్యం కూడా ఉందన్నది తెలిసిందే. ★

• గుంతల్లో మట్టి నింపుతూ... • ఆపై తారు పోస్తూ... • ప్రజా విమర్శలు ఎదుర్కొంటూ.. • కల్లెదుటే ఇలా తయారై...



# కిరణ్మయికి లోక్‌సత్తా సెల్యూట్!

గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదలపై ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక వరుస కథనాలను ప్రచురిస్తూ అధికారుల అవినీతిని బైటపెట్టింది. కొందరు అవినీతి అధికారులకైనా శిక్షలు పడతాయని ఆశపడటంలో తప్పులేదుకానీ.. అధికారుల అవినీతికి తోడు ప్రజల భాగస్వామ్యంలేని స్థానిక పాలన విధానాలను అమలుచేస్తున్న పాలకుల వైఫల్యాలను కూడా ప్రక్షాళన చేస్తేనే జీహెచ్‌ఎంసీ, ఇతర నగరాలు, పట్టణాలు బాగుపడే అవకాశం ఉంటుంది. అధికారులు చేయాల్సిన పనుల్నే పాలకులు చేయడం, అధికారులు చేయాల్సిన పనులు చేసి పెట్టడమే ఎన్నికల్లో గెలవడానికి ఫార్ములా కావడం, అధికారులతో కుమ్మక్కయి నేతలు అవినీతికి పాల్పడటం వంటి కారణాల వల్లే.. నాలుగేళ్లుగా నగర పాలక ఎన్నికలు జరగని విశాఖ నగరంలో ఇటీవల సర్వే చేసినప్పుడు అధికారులకు-ప్రజాప్రతినిధులకే పెద్ద తేడా లేదని ప్రజలు తేల్చి చెప్పారు. అధికారులు కొంత మెరుగ్గా పనిచేస్తే ఎన్నికలే అక్కర్లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాలకుల మీద విశ్వాసం కొరవడటం వల్లే స్పెయిన్‌లో దాదాపు ఏడాదిగా ప్రభుత్వం లేకపోయినా అక్కడ 97శాతం ప్రజలు అదేం పెద్ద విషయం కాదంటున్నారట. అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతల మధ్య తేడా చెరిగిపోతే ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని ఘంటికలు మోగుతున్నా సంస్కరణలకు ఇంకా మనం వేగంగా చొరవ చూపలేకపోతున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల మరో ప్రముఖ తెలుగు దినపత్రిక హైదరాబాద్ ఎడిషన్ ఒక స్ఫూర్తిదాయ ఫోటోను క్లిక్‌మనిపించింది. హైదరాబాద్ రోడ్లను బాగు చేయటానికి సిబ్బంది గుంతల్లో మట్టి వేసి, తారు పోసేస్తుంటే ఒళ్లు మండిన కిరణ్మయి అనే మహిళ వారిని నిలదీశారు. పొద్దున వేసిన రోడ్డు మధ్యాహ్నానికి పోవడాన్ని చూస్తూ రగిలిపోతున్న నగర ప్రజల్లో ఆమె ఒకరు. మనం కట్టే పన్నుల డబ్బుని ప్రభుత్వ సిబ్బంది ఇంత వృధాగా ఖర్చు చేస్తారా? అనే బాధ ఆమెలో ఆవేశంగా మారింది. 'జనం డబ్బేమన్నా రాళ్లనుకుంటున్నారా? ఇదేనా పనిచేయాల్సిన పద్ధతి?' అని వారిని మందలించారు. "ప్రజలు తాము కట్టే పన్నుల డబ్బుకు - తమకు అందే సేవలకు సంబంధాన్ని అర్థం చేసుకుని ఓటు వేస్తేనే రాజకీయం మారుతుంది" అని దేశంలోనే తొలిసారిగా కొత్త రాజకీయ భాషను వాడిన లోక్‌సత్తా భావాన్ని ఒక సాధారణ మహిళ అలవోకగా అమలు చేసింది.. ఇదీ కావలసింది! ఇలాంటి కామన్‌సెన్స్ రాజకీయం, చుట్టూ ఉన్న సమస్యలపై పరిష్కారం సాధించే ఆవేశంతో స్పందించే తత్వం ఇబ్బడిముబ్బడిగా పెరిగితే చాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, భారతదేశం మొత్తం మారిపోతాయి. 'కామన్స్‌సెన్స్ ఎట్ అన్‌కామన్ డిగ్రీ ఈజ్ విజ్‌డమ్/లీడర్‌షిప్' అని రుజువు చేసిన కిరణ్మయికి లోక్‌సత్తా సెల్యూట్! ★

మీరు ప్రభుత్వానికి కట్టే పన్నుల డబ్బులు
ఏమవుతున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా?




మీ వార్డ్లో రోడ్లు, డ్రైనేజ్, నీరు, పారిశుద్ధ్యం లాంటి కీలకమైన వాటికి నిధులు ఖర్చు పెట్టే అధికారం మీకే ఉండాలి! డబ్బులు మీవి, వాటిని ఖర్చుపెట్టే అధికారం కూడా మీదే! రాజకీయ నాయకులు, అధికారులు పందికొక్కుల్లా మీ డబ్బు భోంచేస్తుంటే ఎన్నాళ్ళు చూస్తూ ఉంటారు?

స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి మేము చేసే కృషిలో భాగస్వాములు కండి.
విరాళాలు ఇచ్చి మా ప్రయత్నాలకు శక్తి చేకూర్చండి!

http://donate.fdrindia.org/

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు





**K.SIVA RAMA PRASAD**

B.Com, (C.A)



☎ 08647-253305
Cell: 9848162475
Prasad_cpt@yahoo.co.in

CONSULTANT:
Income Tax & Sales Tax
Business, Housing Loans

# 27-443, Subbaiah Thota, CHILAKALURIPET - 522 616

**గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి**

**పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు**






ఎన్నికల చట్టాల సంస్కరణలో న్యాయవ్యవస్థ పాత్ర' పై భోపాల్‌లోని జాతీయ జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన హైకోర్టు న్యాయమూర్తుల వార్షిక సదస్సులో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం, పాలనపై నేర రాజకీయాల ప్రభావం, 'నోటా' - ప్రజాభిప్రాయం, ఎన్నికల సంస్కరణలపై న్యాయనిర్ణయాలు అంశాలపై ప్రధాన వక్తగా మాట్లాడటంతోపాటు స్వేచ్ఛాయుత ఎన్నికలు, ఎన్నికల్లో డబ్బు ప్రభావం, ఎన్నికల సంఘం పాత్ర తదితర అంశాలపై ప్యానల్ చర్చలో అభిప్రాయాలను తెలియచేశారు. రెండు రోజుల చర్చల్లో జేపీతోపాటు న్యాయం, ఎన్నికలవ్యవస్థలలో విశేష అనుభవమున్న జస్టిస్ పి.వి. రెడ్డి, టి.ఎస్. కృష్ణమూర్తి, డా॥ ఎస్‌వై ఖురేషి, వి.ఎస్. సంపత్ తదితరులు పాల్గొన్నారు.

Posting Date 22-11-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November 16th 2016

# నేను యుద్ధ భూమిని విడిచిపెట్టలేదు!

ఎన్నికలు అనే అస్త్రాన్ని విడిచి,



ఉద్యమం అనే అస్త్రాన్ని చేపట్టాను

**ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకు వచ్చే విద్య-ఆరోగ్యం కోసం , న్యాయ-ఎన్నికల వ్యవస్థలో సంస్కరణల కోసం పోరాడుతున్నా!**

**వీటి గురించి ఏ పార్టీ అయినా మాట్లాడుతుందా ?**

## నిజాలు మాట్లాడుకుందాం-9

షేర్ చెయ్యండి ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad